



మద్దతు ధర.. ఎండమావే!

- పండించిన పంటకు గిట్టుబాటు దక్కక అన్నదాతల అవస్థలు
- జిల్లాలో నాలుగేళ్లుగా ఏటికేడు తీసికట్టుగా ధాన్యం సేకరణ
- నామమాత్రంగానే మార్క్‌ఫెడ్ పాత్ర
- దిగుబడులకు, సేకరణలకు పొంతనే ఉండని వైనం
- రైతుల ఆక్రందన పట్టని వైసీపీ ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వని పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తుంది.. పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచే ఏర్పాటు చేస్తాం.. ఇలా ఒకటేమిటి ఎన్నో వాగ్దానాలు 2019కు ముందు సీఎం జగన్ గుప్పించారు. అయిదేళ్ల తర్వాత సీన్ కట్‌చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించే సంగతి దేవుడెరుగు.. ఏటికేడు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసే ధాన్యం పరిమాణం పడిపోతూ వస్తోంది. పైగా కొనుగోలు కేంద్రాలూ అందుబాటులో ఉండవు.

అరకొరగా కొనుగోలు చేసిన ధాన్యం విషయంలో డబ్బులు పడడం మరో ప్రహసనం. ఇక వాణిజ్య పంటలైన మినుము, పెసరతో పాటు మొక్కజొన్న తదితర పంటల కొనుగోలు విషయంలో మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రం. మొక్కుబడి తంతుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం తప్పితే జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పంటల సంగతి అడిగితే నీళ్లు నమలడం అధికారుల వంతవుతోంది. పైగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువుల పంపిణీ విషయంలో మార్క్ ఫెడ్‌ను చేర్చి దాని అసలు ఉద్దేశం నీరుగార్చే ప్రక్రియకు తెరలేపిన ఘనత వైసీపీది. ఈ విధంగా ఐదేళ్లలో జిల్లా లోని రైతాంగానికి అడుగడు గునా అన్యాయం చేసిన ప్రభుత్వంగా వైసీపీ ప్రభుత్వం మిగిలిపోయిందని రైతులు విమర్శిస్తున్నారు.

బాపట్ల, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ విషయంలో ఏటికేడు తీసికట్టే అన్నట్లు ఉంటోంది. 2023-24కు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ముగింపుకొచ్చేసరికి అదికాస్తా 28,500 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. గతేడాది ఖరీఫ్‌లో అయితే 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకుంటే ఇది కాస్తా 75,000 మెట్రిక్ టన్నుల దగ్గరే ఆగింది. తాజా ఖరీఫ్‌లో సేకరణ గతంతో పోలిస్తే దారుణంగా పడిపోయింది. రబీ సీజన్‌లోనూ ఇదే తంతు. పెట్టుకున్న లక్ష్యాలకు సేకరణకు హస్తిమశకాంతరం ఉంటోంది. ఈ ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా ధాన్యం సేకరణ పరిమాణం పెరగకపోగా సీజన్, సీజన్‌కు తగ్గుదల నమోదవడం గమనార్హం.

సొమ్ము జమ చేయడంలోనూ నిర్లక్ష్యమే..

అరొకరగా సేకరించిన ధాన్యానికి సొమ్ము జమ చేయడంలోనూ వైసీపీ ప్రభుత్వం రైతులకు చుక్కలు చూపెట్టింది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయి తప్పితే రైతులకు కష్టాలు తప్పలేదు. టీడీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఈ అయిదేళ్లలో డబ్బు జమ విషయంలో వైసీపీ వేసిన పిల్లిమొగ్గలు అన్నీఇన్నీ కావు. ధాన్యం సేకరణ విషయంలోనూ ఏకీకృతం అనే కొత్త ఎత్తుగడకు వైసీపీ ప్రభుత్వం తెరతీసింది. ధాన్యం సేకరణను గుత్తాధిపత్యం చేసే ఆలోచనలో భాగంగా ఒకే మిల్లరుకు అప్పగించేలా టెండర్లను కూడా పిలిచింది. ఇది ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

మార్క్‌ఫెడ్ పాత్ర నామమాత్రమే...

జిల్లా ఆవిర్భావం తర్వాత మార్క్‌ఫెడ్ బాపట్లలో కొలువుదీరడానికే దాదాపు ఏడాది పట్టింది. వచ్చిన తర్వాత అయినా పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలుపెట్టిందా అంటే అదీ లేదు. ఏదో మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు తెరిచి మమ అనిపించడం మినహా అన్నదాతల నుంచి సేకరించిన దిగుబడులు తీసికట్టే. జిల్లాలో మినుము దాదాపు 50,000 హెక్టార్లలో సాగు అవుతుండగా, పెసర, శనగ కలిపి దాదాపు 35,000 హెక్టార్ల వరకు సాగు విస్తీర్ణం ఉంది. వీటికి తోడు జొన్న, మొక్కజొన్న, శనగ సేకరణ కూడా మార్క్‌ఫెడ్ బాధ్యతే. మద్దతు ధర మినుము క్వింటాలకు రూ.6,950 ఉండగా, పెసర క్వింటాకు రూ.8,558గా ఉంది. సాగైన విస్తీర్ణంతో పోల్చుకుంటే మొక్కజొన్నతో కూడా కలుపుకుని కనీసం 30,000 టన్నులైనా మార్క్‌ఫెడ్ సేకరించాల్సి ఉంటుంది. కానీ ఈ రెండేళ్లలో మార్క్‌ఫెడ్ పట్టుమని పదివేల టన్నులైనా సేకరించిన దాఖలాలు లేవు. దిగుబడులు దాదాపు లక్ష మెట్రిక్ టన్నులపైన ఉంటే మార్క్‌ఫెడ్ విధించుకునే సేకరణ లక్ష్యాలు పదిశాతం లోపే. దానిని చేరడానికి కూడా ఆపసోపాలు పడే పరిస్థితి ప్రభుత్వానిది.

పంట పండించుకుంటున్న దళారులు...

ప్రభుత్వం మద్దతు ధర విషయంలో రైతులకు చేస్తున్న అన్యాయం దళారులకు వరంగా మారుతోంది. ముఖ్యంగా ధాన్యం మద్దతు ధర విషయంలో ప్రభుత్వం విధించే అలవిమాలిన నిబంధనలు అన్నదాతలకు గుదిబండగా మారి కొనుగోలు కేంద్రాల వైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇక ధాన్యం డబ్బుల జమ విషయంలో నెలల తరబడి జరుగుతున్న జాప్యం కూడా వారిని దళారుల వైపు మళ్లేలా పురిగొల్పుతోంది. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలా ఈ ఐదేళ్లలో మద్దతు ధర విషయంలో రైతులు నిలువునా మోసానికి గురయ్యారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ ఉందో పాలకులకే తెలియాలి. ఇక మిర్చి రైతుల గోడు వినేవారే కరువ య్యారు. జిల్లాలో ధాన్యం తర్వాత ఉద్యాన పంట అయినా మిర్చి వైపు అన్నదాతలు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. కేంద్రం మద్దతు ధర ఇవ్వని పంటలకు తన ప్రభుత్వం ఇస్తుందని జగన్ చెప్పిన మాటలను ఎన్నికల వేళ సీఎంకు రైతులు గుర్తు చేస్తున్నారు.

రకరకాల సాకులు

మద్దతు ధర విషయంలో అన్నదాతలకు జరుగుతున్న అన్యాయం విషయంలో ప్రభుత్వం ఏవో కుంటిసాకులు చెబుతూనే వస్తోంది. ఆర్‌బీకేలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామనే మార్క్‌ఫెడ్ మాటలు ఉత్తమాటలుగానే మిగిలిపోతున్నాయి. ఏదో మొక్కుబడిగా ఒకటిరెండు రోజులు ఏర్పాటు చేయడం తర్వాత సర్దేయడం రివాజుగా మారింది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల మద్దతు ధరకు అమ్ముకోవడానికి అన్నదాతలు ఆసక్తి చూపించడం లేదని చెబుతారు. ఇది కొంతమేర వాస్తవమే అయినప్పటికీ సమాంతరంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరచి ఉంటేనే బయటి మార్కెట్‌లో ధర స్థిరంగా ఉంటుందనే ప్రాథమిక సూత్రాన్ని కూడా మరచి అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఇక పత్తి కొనుగోలు విషయంలో సీసీఐది కీలక పాత్ర. దీనికి సంబంధించి బాపట్ల జిల్లాలో ప్రతినిధులెవరో, కార్యాలయమెక్కడో ఎవరికీ తెలియదు.



ప్రత్తిపాడు.. పసుపుమయం

- అట్టహాసంగా రామాంజనేయులు నామినేషన్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థిగా బూర్ల రామాంజనేయులు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. గుంటూరు నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ ప్రత్తిపాడు వరకు సాగింది. దారి పొడవునా అన్ని గ్రామాలలో రామాంజనేయులుకు ప్రజలు నీరాజనాలు పలికారు. మండు టెండలను లెక్కచేయకుండా కూటమి కార్యకర్తలు ఉత్సాహంతో ర్యాలీలో పాల్గొన్నారు. ఏటుకూరు గ్రామస్తులు జేజేలు పలుకుతూ గజమాలతో రామాంజనేయులును సత్కరించారు. పుల్లడిగుంట, కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి ర్యాలీలో భాగమయ్యారు. ప్రత్తిపాడుకు చేరుకునే సరికి పెదనందిపాడు, కాకుమాను మండలాల నుంచి వేలాది మంది పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. దీంతో ప్రత్తిపాడు పసుపుమయంగా మారింది. భవాని వాసు బిల్డింగ్ వద్ద గింజుపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో నేతలకు గజమాలను వేశారు. ఓపెన్ టాప్ జీపులో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, తాటిశెట్టి మురళిలు ప్రత్యేకంగా నిలిచారు.



ఆర్వో శ్రీకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బూర్ల రామాంజనేయులు



పెమ్మసాని ప్రభంజనం

- అట్టహాసంగా టీడీపీ నామినేషన్ల పర్వం
- చంద్రశేఖర్, మాధవి, నసీర్‌ల భారీ ప్రదర్శన
- టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో దద్దరిల్లిన గుంటూరు



జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గుంటూరు తూర్పు నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి నసీర్, సుభాని, డేగల,నేరేళ్ల



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి, నాని

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు జెండాలతో కదలిరాగా.. సోమవారం గుంటూరులో జరిగిన కూటమి అభ్యర్థుల నామినేషన్ల పర్వం హోరెత్తిపోయింది. కూటమి తరఫున పోటీలో ఉన్న గుంటూరు లోకసభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ, తూర్పు అభ్యర్థులు మాధవి, నజీర్ నామినేషన్ల సందర్భంగా గుంటూరు పసుపుమయంగా మారింది. జనసైనికుల తెలుపు జెండాలు, బీజేపీ కాషాయ జెండాలు తోడు రాగా నగర వీధుల్లో పార్టీ జెండాలు కవాతు చేశాయి. సోమవారం ఉదయం గుజ్జనగుండ్ల నుంచి ప్రారంభమైన జన ప్రవాహం కలెక్టరేట్, మున్సిపల్ కార్పొరేషన్ వరకూ సాగింది. ఒక వైపు నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, మరో వైపు నుంచి పిడుగురాళ్ల(గల్లా) మాధవి, ఇంకో వైపు నుంచి మొహమ్మద్ నసీర్ నగరంలో మహా ప్రదర్శనగా నామినేషన్లకు బయలుదేరారు. మాజీ మంత్రులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నన్నపనేని రాజకుమారి, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు పెమ్మసాని, గల్లా మాధవిల ప్రచార రథంపై వారికి తోడుగా నిలిచారు. లాడ్జి సెంటర్లో వందలాదిమంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కూటమికి మద్దతుగా ప్రదర్శనలో భాగమయ్యారు. తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీరత్న దంపతులు తొలుత సర్వ మత ప్రార్థనలు చేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దల ఆశీర్వాదం అందుకుని నామినేషన్‌కు బయలుదేరారు. గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలిరాగా ప్రదర్శనగా ఆయన కలెక్టరేట్‌కు చేరుకుని తెనాలి శ్రావణ్‌కుమార్, గుదె వెంకటేశ్వర్లు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సమక్షంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. దారిపొడవునా ప్రజలు మంగళ హారతులు, పూల వర్షాలు, గజమాలలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు.

- గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గల్లా మాధవి, రామచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సర్వమత ప్రార్థనలు నిర్వహించి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ప్రదర్శనగా నామినేషన్‌కు బయలుదేరారు. మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో కే.రాజ్యలక్ష్మి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. ఆర్-5 జోన్ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.
- నసీర్ తొలుత ఆర్ అగ్రహారంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బీ- ఫారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలాదిమంది టీడీపీ- జనసేన- బీజేపీ కార్యకర్తలు, ముస్లింలతో కలిసి భారీ ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయం చేరుకుని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

● పెమ్మసాని స్వచ్ఛభారత్ స్ఫూర్తి

వేలాదిమందితో జరిగిన నామినేషన్ ప్రదర్శనలో పెమ్మసాని స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రదర్శించారు. ప్రదర్శన సందర్భంగా రోడ్లపై పడిన మజ్జిగ ప్యాకెట్లు, మంచినీటి సీసాలు, తోరణాలు, జెండాలను ప్రదర్శన అయిపోయిన వెంటనే వందలమంది ప్రైవేటు శానిటరీ సిబ్బందితో శుభ్రం చేయించారు. ప్రదర్శన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంపై సామాజిక మీడియా ద్వారా ప్రజలను క్షమాపణలు కోరి తన పెద్ద మనసు చాటుకున్నారు.

బాలికలదే హవా...

- 'పది' ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- బాపట్ల 88.19, గుంటూరు 88.14, పల్నాడు 86.05 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 14, 16, 18 స్థానాల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలు

గుంటూరు(విద్య), నరసరావుపేట, బాపట్ల టౌన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా చూపారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పది పరీక్షలకు సంబంధించి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఉత్తీర్ణతలో ముందు ఉన్నారు. గుంటూరు జిల్లా నుంచి 27,178 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 23,955 మంది (88.14 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాపట్లజిల్లా నుంచి 16718 మంది హాజరుకాగా 14,743 మంది (89.19 శాతం) సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 11శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాలో అబ్బాయిలు 86.32, అమ్మాయిలు 91.11శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లాలో అబ్బాయిలు 86.46, అమ్మాయిలు 89.9శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో బాపట్ల జిల్లాకు 14వ స్థానం దక్కింది.

పల్నాడుజిల్లా నుంచి 24,959 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 21,477 మంది (86.05 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. పల్నాడులో అబ్బాయిలు 83.77, అమ్మాయిలు 88.45శాతం ఉత్తీర్ణత సాధించారు. 16,769 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత కాగా 3,482 మంది ఫెయిలయ్యారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత 17.10 శాతం పెరిగింది. రాష్ట్రంలో పల్నాడు జిల్లా 18వ స్థానంలో నిలిచింది. గతేడాది బాపట్లజిల్లా 75.31 శాతం, గుంటూరు 77.4 శాతం, పల్నాడు 69.47 శాతంగా నమోదైంది. అంటే ఈ ఏడాది ఫలితాలు మెరుగైనట్లే.

యాప్‌లే కారణమా.. విద్యారంగ ఖిల్లాగా పేరొందిన గుంటూరు జిల్లా పది ఫలితాల్లో చతికల పడింది. ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రంలో టాప్‌టెన్‌లో ఉన్న జిల్లా ఈ ఏడాది దిగజారింది. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ హడావిడి ఫలితాల్లో ఎక్కడా కనపించలేదు. యాప్‌ల యావ తప్ప.. పర్యవేక్షణా లోపం ఫలితాల సాధనలో స్పష్టంగా కనిపించింది. హెచ్‌ఎం స్థాయి నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు ఏదో ఒక యాప్‌ల పనుల్లోనే మునిగిపోయారు. ఉదయం మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం, గుడ్ల పంపిణీ, చిక్కీల పంపిణీ, నాడు నేడు పనుల పర్యవేక్షణ ఇలా ప్రతిదానికీ యాప్‌లతోనే ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. మరో వైపు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలలకు వచ్చిచేసే హడావిడితో అసలు బోధనే మరుగున పడి ఫలితాల్లో వెనుకంజ పడినట్లు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

పల్నాడు జిల్లాలోని అనేక పాఠశాలల నుంచి సబ్జెక్టు టీచర్లు గుంటూరు జిల్లాలోని అనేక పాఠశాలల్లో అక్రమ బదిలీపై చేరిపోయారు. దీంతో అక్కడ భారీస్థాయిలో టీచర్ల కొరత ఏర్పడింది. కనీసం విద్యా వలంటీర్లను నియమించుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు జడ్పీ, ప్రభుత్వ, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కనీసం పరీక్షల సమయంలో అల్పాహారం అందించలేని దుస్థితి నెలకొంది, ఇలా అనేక కారణాలతో ఉమ్మడి జిల్లాలో ఉత్తీర్ణత దిగజారినట్లు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు విశ్లేషించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల మలి విడత జాబితా విడుదల

గుంటూరు, ఏప్రిల్ 22: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మలి విడత జాబితాను ఆ పార్టీ అధిష్టానం సోమవారం రాత్రి విడుదల చేసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, తెనాలి నియోజకవర్గం నుంచి షేక్ బాషీద్, రేపల్లె మోపిదేవి శ్రీనివాసరావు కాగా ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన తాడికొండకు మణిచల సుశీల్‌రాజాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాడికొండకు చిలకా విజయ్‌కుమార్‌ను తొలి జాబితాలో ప్రకటించి తాజాగా ఆయన్ను తప్పించి ఆయన స్థానంలో సుశీల్ రాజాను నియమించటం, తెనాలిలో పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ, తొలి నుంచి టికెట్ ఆశించిన డాక్టర్ చందు సాంబశివుడును కాదని వేరొకరికి టికెట్ కేటాయించటంపై పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

మంగళగిరి అభివృద్ధే నా ఏకైక లక్ష్యం


లోకేశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న జాస్మిన్ అపార్టుమెంట్‌వాసులు

- మంగళగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి నారా లోకేశ్
- కాజాలో అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశం

మంగళగిరి, ఏప్రిల్ 22: అన్నీ ప్రాంతాల్లో సమగ్రమైన రీతిలో మౌలికసదుపాయాలు.. అందమైన పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలు, యువతకు ఉపాధి ఉద్యోగవకాశాలు.. ఎటు చూసినా ఆహ్లాదకరమైన వాతావరణం... ఇదే.. నా మంగళగిరి అభివృద్ధి విజన్! మళ్లీ చెబుతున్నా.. దేశం మొత్తంమీద అభివృద్ధికి కేరాఫ్‌గా మంగళగిరి వుంటుందని స్థానిక టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ అన్నారు. నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఉదయం ఆయన కాజలోని ఏఆర్ అపార్టుమెంట్, జాస్మిన్ అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా మురుగుడు హనుమంతరావు కుటుంబానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డికి మీరు అవకాశమిచ్చారు. కానీ ఇక్కడి ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదు. ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్కరికీ ఇంటిపట్టాను ఇవ్వనూ లేదు. నాకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి... మంగళగిరి రూపురేఖలు మారుస్తా.. ఇక్కడి ప్రజల జీవితాల్లోకి వెలుగులు తీసుకొస్తానంటూ లోకేశ్ హామీనిచ్చారు. నేను గతంలో ఇక్కడ ఓడినా ప్రజల కోసం 29 రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాను. టీపీఓ కంపెనీని తీసుకొచ్చి 150 మందికి ఉద్యోగాలను ఇప్పించాను. ఇక ఎమ్మెల్యేగా అవకాశమిస్తే మంగళగిరిని ఏస్థాయిలో అభివృద్ధి చేస్తానో మీరే వూహించుకోవాలన్నారు. మంగళగిరి అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. మంగళగిరిలో బ్లాక్ మోడల్ అభివృద్ధిని తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ మంతటా భూగర్భ డ్రైనేజిల నిర్మాణం.. ఇంటింటికి శుద్ధి చేసిన కృష్ణాజలాల పంపిణీ, జోన్ మోడల్‌లో పెద్దపెద్ద పార్కులు, ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తామని లోకేశ్ వివరించారు.

మంగళగిరిలో చేనేత తరువాత ఎక్కువమంది యువత స్వర్ణకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారిని ఆదుకోవల్సిన బాధ్యత తనపై వుందన్నారు. మంగళగిరిలో అతిపెద్ద గోల్డ్ హబ్‌ను ఏర్పాటుచేయడం ద్వారా స్వర్ణకార వృత్తిదారుల తలరాతలను మార్చివేస్తానన్నారు. 50నుంచి వంద ఎకరాల్లో ఈ గోల్డ్‌హబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దీనివలన 30 వేలనుంచి 40 వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని లోకేశ్ వివరించారు. తనిష్క్, జోయాలలుక్కాస్ వంటి పెద్దపెద్ద జ్యూయలరీ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని వారికి కావల్సిన ఆభరణాలను ఇక్కడే తయారుచేయిస్తాం. ల్యాబ్ డైమండ్స్ తయారీని కూడ ప్రోత్సహిస్తామని చెప్పారు. ఆభరణాల తయారీ అంటే మంగళగిరి గుర్తుకొచ్చేలా ఈ గోల్డ్‌హబ్‌ను అభివృద్ధి చేస్తామని వివరించారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరికి అనేక ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చామని లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే కూటమి ప్రభుత్వంలోనూ ఐటీ పరిశ్రమలను మరిన్నింటిని మంగళగిరికి తీసుకువస్తామన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య, బెస్ట్ ఎవైలబుల్ స్కూల్స్ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. విద్యాదీవెన పథకం స్థానంలో తిరిగి పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువస్తామన్నారు. ఉద్యోగులకు ప్రతీనెలా 1న జీతాలు అందేలా తమ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ అభివృద్ధిని చూడాలంటే ప్రజలు తనకు అండగా నిలిచి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమాల్లో జనసేన చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ జనసేన అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య, తోట పార్థసారధి, గాదె పిచ్చిరెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు, జవ్వాది కిరణ్‌చంద్, మాదల రమేష్, నంబూరు రవి, మన్నెం సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అపార్టుమెంట్ వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్


వినుకొండలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, జీవీ ఆంజనేయులు

కూటమి అభ్యర్థులకే బీసీల మద్దతు

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, వినుకొండ, ఏప్రిల్ 22: భావితరాల భవిష్యత్ కోసం ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సోమవారం నరసరావుపేట, వినుకొండలో కేసన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం సంక్షేమమే కాకుండా అభివృద్ధి జరగాలన్నారు. రాజధాని లేని అనాథ రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. రాష్ట్రంలో బీసీలపై అత్యాచారాలు, దాడులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఐదేళ్ళుగా జరుగుతున్న వైసీపీ అరాచకాలు చూస్తూ బీసీ సంక్షేమ సంఘం కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారని అన్నారు. ఈ అవినీతి, దుర్మార్గ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. రాష్ట్రం మొత్తం మీద 3వేల బీసీల మీద దాడులు జరిగాయాని, పల్నాడు జిల్లాలో 26 మందిని హత్యచేశారని అన్నారు. నరసరావుపేట పట్టణంలో వరవకట్టకు చెందిన ఇబ్రహీం అనే ముస్లిం వ్యక్తిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కనుసన్నల్లో హత్యచేశారని అన్నారు. అలవాలలో వెన్నా బాలకోటిరెడ్డిని హత్యచేశారని అన్నారు.

వినుకొండలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. టీడీపీ అంటేనే బీసీల పార్టీ అని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే బీసీలకు ప్రత్యేక చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్‌లో పెట్టిన అన్నింటిని అమలు చేయించుకోవాలంటే కూటమిని గెలిపించుకోవాలన్నారు. ఆయా సమావేశాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, బాదుగున్నల శ్రీను, తన్నీరు ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, న్యాయవాది సైదారావు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు దిగి ముగ్గురు యువకుల మృతి

- తుర్లపాడు మేజరు కాలువ వద్ద ఘటన
- మృతులు ములకలూరువాసులు

నాదెండ్ల / నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 22: మండలంలో ప్రవహిస్తున్న తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతి చెందారు. కాలువ పక్కనే ఉన్న రోడ్డుపై మోటారు బైక్, చెప్పులు, దుస్తులను గుర్తించటంతో పాటు కాలువలో తేలాడుతున్న మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించటంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. అక్కడ ఉన్న వస్తువులు ప్రకారం మృతిచెందిన ముగ్గురు నరసరావుపేట మండలంలోని ములకలూరు గ్రామస్తులుగా గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలూరు గ్రామానికి చెందిన చలమల రాజు(20), గేరా పురుషోత్తం(20), బోరుగడ్డ ఆకాష్‌లు(21)లు ఒకే మోటారు సైకిల్‌పై ఆదివారం ఎండుగుంపాలెం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కనపర్రు - సాతులూరు గ్రామాల మధ్య తుర్లపాడు మేజరు కాలువలో ఈతకు దిగారు. ఈత కొడుతూ ముగ్గురు గల్లంతయ్యారు. సోమవారం నీటి ప్రవాహం తగ్గటంతో తేలి యాడటంతో ఒక మృతదేహాన్ని గుర్తించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో మిగిలిన రెండు మృతదేహాలను కాలువలో నుంచి వెలికి తీశారు. రాజు సెక్యూరిటీ గార్డుగా, ఆకాష్ కార్పెంటర్‌గా పనిచేస్తుండగా పురుషోత్తం ఇంటర్ పూర్తిచేశాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు అవివాహితులు కాగా.. స్నేహితులు కూడా కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మరోసారి మోసపోయేది లేదు

- 1588వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 22: అధికారంలోకి రాక ముందు నుండే సీఎం జగన్ రెడ్డి అమరావతి రాజధానిపై కక్షపెంచుకున్నాడని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్,మూడు రాజధానులొద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1588వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పైకి మాత్రం అమరావతిని స్వాగతిస్తున్నాను.. విజయవాడ గుంటూరు మధ్య 30వేల ఎకరాలు రాజధానికి అవసరమవుతుందని చెప్పిన జగన్‌రెడ్డి సీఎంగా అందలం ఎక్కగానే అమరావతిని నాశనం చేయటమే ధ్యేయంగా పెట్టుకున్నాడన్నారు. అమరావతితో పాటు రాష్ట్రాభివృద్ధిని కూడా కుంటు పరిచిన జగన్‌రెడ్డిని ఇంటికి పంపటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.


అత్యధిక మార్కులు సాధించిన దీపికాశ్రీ, విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నిరంతర పర్యవేక్షణతోనే అత్యున్నత ఫలితాలు

- భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య),ఏప్రిల్22: విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు నిరంతర పర్యవేక్షణ కారణంగా భాష్యం విద్యాసంస్థల్లో అత్యున్నత ఫలితాలు సాధ్యం అయ్యాయని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ వెల్లడించారు. పదిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన సోమవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల విదార్థిని జి.దీపికాశ్రీ 597లతో అగ్రస్థానంలో నిచినట్లు తెలిపారు. ఇంకా కె.వెంకట సాయిభావన 596, షైషరీనా 596 మార్కులు సాధించారని వివరించారు. తమ విద్యార్థిని ఎస్.గాయత్రి 595, కె.లక్ష్మీహంసిని 595, ఎస్.ఆశ్రిత 596 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. కాగా తమ విద్యార్థులు 590 పైగా మార్కులను 90మంది, 580 పైగా 588, 670 ఆ పైగా 1299, 550పైగా మార్కులు 2,809 మంది, 500 ఆ పైగా మార్కులు 5,783 మంది సాధించారన్నారు. ఇక గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1,113 మంది, 95 పైగా సాధించిన వారు 3627 మంది, 90 పైగా సాధించిన వారు 5103 మంది ఉన్నారని వెల్లడించారు. అదే విధంగా సైన్స్‌లో 100కు 100 సాధించిన విద్యార్థులు 251 మంది, 95పైగా మార్కులు 2117 మంది, 90 పైగా 4016 మంది సాధించారని వివరించారు. విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు అభినందించారు.

టీడీపీ కార్యాలయానికి నిప్పు


దహనమైన టీడీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న భాష్యం ప్రవీణ్

- నాగిరెడ్డిపాలెంలో దుండగుల దుశ్చర్య
- దహనమైన కార్యాలయాన్ని పరిశీలించిన భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 22: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు టీడీపీ కార్యాలయానికి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు హుటాహుటిన కార్యాలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ గురునాథం, క్రోసూరు సీఐ మంగారావు తెల్లవారు జామున నాలుగు గంటలకు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి మాట్లాడుతూ కావాలనే వైసీపీ నాయకులు టీడీపీ కార్యాలయాన్ని దహనం చేశారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలు సోదరి రాణి రుద్రమదేవి ప్రచారం నిర్వహిస్తుండగా వైసీపీ నాయకులు వారి ప్రచార రథాలను అడ్డు పెట్టేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఇతర గ్రామాల నుంచి 200 మంది కార్యకర్తలను రప్పించి దాడిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని, టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు రువ్వారని తెలిపారు. తెల్లవారు జామున 2గంటల సమయంలో ఎవరూ లేకుండా చూసి పార్టీ కార్యాలయాన్ని దహనం చేయటం ఏంటని? ప్రశ్నించారు. అనంతరం సుమారుగా 9 మందిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇది పిరికిపంద చర్య : భాష్యం ప్రవీణ్

టీడీపీ కార్యాలయాలను దహనం చేయటం పిరికిపంద చర్య అని పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. బాష్యం ప్రవీణ్, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో కలసి దహనమైన కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో క్రోసూరు పార్టీ కార్యాలయాన్ని దహనం చేశారని, ఇప్పుడు బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం పార్టీ కార్యాలయాన్ని దహనం చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పెదకూరపాడు వైసీపీ అభ్యర్థి నామినేషన్‌కు వస్తే మస్టర్ ఫ్రీగా వేస్తామని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలకు చెపుతున్నారని భాష్యం ప్రవీణ్ ఆరోపించారు. వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపాలెం గ్రామంలో టీడీపీకి పూర్తి మెజార్టీ వస్తుందనే ఉద్దేశంతో భయభ్రాంతులకు గురిచేయాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆయన వెంట రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోర్‌కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, సర్పంచ్ జ్యోతి సముద్రం, గుడిసె కొండయ్య, గుంజా గంగారావు, ఓర్చు ఆనంద్, తమ్మిశెట్టి సత్యనారాయణ, హనుమంతరావు నాయక్, రామకృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిధర్‌కు నగర బాధ్యతలు

- ఎమ్మెల్యే అభ్యర్థిగా పీకేశారు..
- ఆర్యవైశ్య సామాజికవర్గం ఓట్ల కోసమేనంటూ విమర్శలు

గుంటూరు, ఏప్రిల్ 22: వైసీపీ నగర అధ్యక్షుడుగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్టానం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నామినేషన్‌ల తరుణంలో ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించటంపై ఆ పార్టీలోనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన మద్దాళి గిరిధర్‌ను పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపి గెలిపించారు. అనంతరం పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే గిరిధర్ వైసీపీలోకి జంప్ చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కూడా వైసీపీ టిక్కెట్ తనకే వస్తుందని గిరిధర్ ఆశపడ్డారు. చివరకు గిరిధర్‌ని కాదని వైసీపీ అధిష్టానం చిలకలూరిపేట నుంచి మంత్రి విడదల రజినీని వైసీపీ అభ్యర్థిగా పశ్చిమ బరిలో నిలపటంపై ఆర్యవైశ్య సామాజిక వర్గీయులు గుర్రుగా ఉన్నారు. పైగా ఇటీవల పార్టీలో ఎమ్మెల్యే గిరిధర్‌కు ప్రాధాన్యత కూడా తగ్గుతోందని ప్రచారం జరుగుతోంది. దాదాపు మూడేళ్ళ నుంచి వైసీపీ నగర అధ్యక్ష పదవి ఖాళీగానే ఉంటోంది. ఎన్నికల సమయంలో హఠాత్తుగా ఎమ్మెల్యే గిరిధర్‌కు నగర అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించి ఆ వర్గం ఓట్లు పొందేందుకు కొత్త ఎత్తుగడగా పార్టీలోని కార్యకర్తలే గుసగుసలాడుకుంటున్నారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి, తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, డీసీసీబీ చైర్మన్ రాతంశెట్టి రామాంజినేయులు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అమరావతి నమూనాల పరిరక్షణకు చర్యలు

తుళ్లూరు,ఏప్రిల్22: అమరావతి నమూనాల పరిరక్షణకు సీఆర్డీఏలోని ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగింది. ఈ బృందం అమరావతి ప్రాంతంలో క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. సీఆర్డీఏకు సంబంధించిన నమూనాలను నిరంతరం తనిఖీ చేస్తారు. ఉద్దండ్రాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన చేసిన ప్రదేశంలో ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను నియమించి అక్కడ నమూనాల పరిరక్షణకు ప్రత్యేకచర్యలు చేపట్టామని ఏపీ సీఆర్డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ తెలిపారని కార్యలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.


క్షతగాత్రులను పరామర్శించిన కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

టీడీపీ కార్యకర్తలపై దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు .. పరామర్శించిన కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 22: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన ఘటన మండలంలోని పెద మక్కెన-పెదకూరపాడు మధ్యలోగల పెట్రోల్‌బంకు వద్ద సోమవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చేందుకు పెద మక్కెనకు చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నేతలు మత్తుపల్లి మేరి బాబు, నాగరాజు, మత్తుపల్లి సంగీతరావు, జరుగుమల్లి ఏసయ్య, దిడ్ల పెద నాగరాజు, అనిల్ తదతరులు సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్ళారు. అక్కడ జైబాలయ్య.. టీడీపీ వర్ధిల్లాలం టూ నినాదాలు చేశారు. ఆ సమయంలో పెదకూర పాడు వైసీపీ నామినేషన్‌కు వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి టీడీపీ కార్యకర్తలపై రాళ్ళు కర్రలతో దాడిచేశారు. స్థానికులు వారిని సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు తదితరులు వైద్యశాలకు వెళ్ళి క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

పెదనందిపాడు, ఏప్రిల్, 22: గుంటూరు పర్చూరు రహదారిలోని వరగాని వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన వి. విమలబాబు వరగానికి ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వాహనం ఢీకొట్టింది. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఎస్‌ఐ రాజ్‌కుమార్ అక్కడకు చేరుకొని క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

తుమ్మకోటలో వివాహిత దారుణ హత్య

రెంటచింతల, ఏప్రిల్ 22: మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఓ వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం వేకువ జామున జరిగింది. కారంపూడి సీఐ బి.చినమల్లయ్య, ఎస్‌ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ప్రకారం.. ఆదివారం తుమ్మకోటలో విఘ్నేశ్వరుని ఆలయ ప్రతిష్టతో పాటు బంధువుల ఇంట వివాహ వేడుకలకు కుంకలకుంట్ల భారతి (43) తన కుమారుడు మధు ప్రశాంత్, కూతురు లక్ష్మీ ప్రసన్నతో కలిసి నరసరావుపేట నుంచి వచ్చింది. భర్త శివప్రసాద్ నరసరావుపేటలోనే ఇతర వేడుకకు వెళ్లారు. అర్ధరాత్రి ఒంటి గంట వరకు భోజనాలు వడ్డించారు. రెండు గంటల సమయంలో ఆరు బయట నిద్రకు ఉపక్రమించగా పిల్లలు మాత్రం వేరే గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున లేచి చూడగా భారతి తల ఛిద్రమై విగత జీవిగా పడివుంది. సమీపంలో వ్యవసాయ పనులకు ఉపయోగించే మేడి కర్రతో తీవ్రంగా కొట్టగా దిండంతా రక్తంతో తడిసి పోయింది. సంఘటనా స్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపురాజు పరిశీలించారు. క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్‌లు రంగ ప్రవేశం చేశాయి. కుమారుడు మధు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

93,891 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 95,448 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 93,891 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 60,589 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500
నెంబరు. 5	9000	11500
273	12000	13500
341	8500	16000
4884	11000	13500
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	16000
దేవనూరు డీలక్స్	8000	13500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎన్డీఏ నాయకులు

నామినేషన్‌కు తరలివచ్చిన శ్రేణులకు ధన్యవాదాలు

● ఎన్డీఏ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22: నామినేషన్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. నామినేషన్ అనంతరం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే అభ్యర్థులు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ర్యాలీలో పాల్గొన్న వారికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఓటింగ్ వరకు ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలన్నారు. దివ్యాంగులు, మహిళలు, యువత, అమరావతి ప్రజలు, రైతులు ర్యాలీలో పాల్గొని నైతిక మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వంపై అమరావతి ప్రజలు ఎంతో వ్యతిరేకంగా ఉన్నారనే, ఈ ర్యాలీతో రుజువైందన్నారు. ర్యాలీతో నా విజయం ఖరారు అయ్యిందని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని స్పష్టం చేశారు. కంఠంలో ప్రాణం పొయ్యేవరకు ప్రజల సేవలో ఉంటానని. అవినీతికి తావు లేని రాజకీయాలు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు వనమా నరేంద్ర. గాదె వేంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేష్‌యాదవ్, రావిపాటి సాయికృష్ణ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నగరవాసులకు క్షమాపణలు

భారీ ర్యాలీ సందర్భంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలతో నగరవాసులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారని, దీనిని ప్రతి ఒక్కరూ క్షమించాలని ఎన్డీఏ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు.

ఎన్డీయే విజయానికి ప్రతి మాదిగ పని చేయాలి

● ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22 : రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ గెలుపునకు ప్రతి మాదిగ పని చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మోదీ, చంద్రబాబు అనుకూలంగా ఉన్నారని, ఈ కారణంగా వారితోనే నడవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు ఉన్న 29 సీట్లలో పొత్తులో 25 సీట్లు తీసుకున్న టీడీపీ 14 స్థానాలు మాదిగలకు కేటాయించి పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. కానీ వైసీపీ మాత్రం 29 సీట్లులో మాదిగలకు 10 మాత్రమే కేటాయించి మిగిలిన 19 సీట్లు మాలలకు ఇచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దాదాపు 90 శాతం ఖర్చు పెట్టారని, కానీ జగన్ మాత్రం నిధులను దారి మళ్లించాడ ని ఆరోపించారు. మాదిగలకు జగన్ ప్రథమ శత్రువుగా భావించి వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదిగ దండోరా నాయకులు కొన్నెగంటి రమేష్ మాదిగ, నవ్య మాదిగ, చర్మకారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేజండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు, పాల్గొన్న సంఘ నాయకులు

నేడు ఓటర్ల చైతన్య లఘుచిత్రాల ఆవిష్కరణ

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 22 : సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని రామన్నపేటలో గల జన చైతన్య వేదిక హాలులో ఓటర్ల చైతన్య లఘు చిత్రాలను సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, పూర్వ రాష్ట్ర ఎన్నికల అధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆవిష్కరిస్తారని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారు రూపొందించిన ఐదు లఘు చిత్రాలు ఓటర్లను చైతన్యపరచడానికి తోడ్పడుతున్నాయన్నారు. జె.వి.మోహన్‌రావు రచించిన లఘు చిత్రాలకు ప్రజా కళాకారులు ఎస్.జయరావు దర్శకత్వం వహించారు. శ్రీకారం అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి జాస్తి అనురాధ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్షుడు టి.సాంబశివరావు, కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు సమష్టి కృషితో ఐదు లఘు చిత్రాలను రూపొందించారని తెలిపారు. ఓటర్ల చైతన్య లఘు చిత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రంగయ్య, పారదర్శక ఎన్నికల పర్యవేక్షణ సమితి కన్వీనర్ పి.మల్లికార్జునరావు ప్రసంగిస్తారని అన్నారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ జరగాలని, ప్రజాస్వామ్యం వికసించాలని భావించే ప్రజాస్వామ్యవాదులు ఓటర్ల చైతన్య లఘు చిత్రాల ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 22 : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటాద్రిపేట, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డు, నెహ్రూనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే బ్రాడీపేట ఒకటో లైను నుంచి నాలుగో లైను వరకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మద్యం సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో రూ.2,360 విలువ గల 5.3 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రూ.2,31,29,200 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

గుంటూరు గడ్డ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే

● పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు గడ్డ టీడీపీ- జనసేన- బీజేపీ కూటమిదేనని, దానికి నామినేషన్ సందర్భంగా జరిగిన ప్రదర్శనే సాక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. గుంటూరు కార్పొరేషన్‌లో సోమవారం ఆమె నామినేషన్ దాఖలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అభిమానుల మధ్య ఊరేగింపుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్న గల్లా మాధవి, జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని), భర్త గల్లా రామచంద్రరావు, సీనియర్ నాయకుడు రావి రామచంద్రరావు, డాక్టర్ సురేంద్రలతో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో గుంటూరు రోడ్లు పసుపు మయంగా మారాయి. తొలుత గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, సర్వమత ప్రార్థనలు చేసిన ఆమె, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో ప్రజలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. అనేక చోట్ల అభిమానులు భారీగా గజమాలలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉదయం 10 గంటలకు మొదలైన ర్యాలీ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సాగి మునిసిపల్ కార్పొరేషన్‌కు చేరుకుంది. గుజ్జనగుండ్ల, బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి గుడి వద్ద నుంచి ప్రారంభమై లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, హాలీవుడ్, బాలీవుడ్ థియేటర్ కార్నర్, లాడ్జి సెంటర్, అరండల్‌పేట బ్రిడ్జి, హిందూకాలేజీ సిగ్నల్స్ మీదగా మునిసిపల్ కార్యాలయం చేరుకుంది. అభిమానులు, ప్రజలు ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో పాల్గొనటం, కనివిని ఎరుగని రీతిలో ఈ కార్యక్రమం విజయవంతం అయింది. దీంతో మూడు పార్టీల శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. అతి తక్కువ రోజుల్లోనే గుంటూరు పశ్చిమపై టీడీపీ జెండాను ఎగరవేయబోతున్నట్లు అభిమానులు ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం గల్లా మాధవి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటిదాకా తన వెంట నిలిచిన అశేష జనవాహినిలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. అదే విధంగా తనని గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. గెలిచిన మరుక్షణం నుంచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు అభిమానులు



నామినేషన్ పత్రాలు అందజేసి బయటకు వస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

ఎంపీ స్థానానికి మరో ఆరుగురు నామినేషన్ల దాఖలు

● ఏడు ఎమ్మెల్యే సీట్లకు 32 నామినేషన్లు

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లోక్‌సభ స్థానానికి మరో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం తొలుత టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రెండు సెట్లు, ఆ తర్వాత ఆయన సోదరుడు పెమ్మసాని రవిశంకర్ నామినేషన్ వేశారు. ఆల్ పీపుల్స్ పార్టీ తరుపున బొమ్మసాని ముత్యాలరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి నుంచి మొహమ్మద్ కాజా మొయినుద్దీన్ చిష్టీపాషా, బెంగలూరు నవనిర్మాణ పార్టీ నుంచి విష్ణురెడ్డి లక్ష్మిరెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా షేక్ కాజావలి నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆరుగురు అభ్యర్థుల వద్ద నామినేషన్ పత్రాలను స్వీకరించారు. నామినేషన్ల దాఖలుకు మరో మూడు రోజుల సమయం ఉండటంతో మరికొంతమంది కూడా దాఖలు చేసే అవకాశం ఉన్నది.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మరో 32 నామినేషన్లు సోమవారం వచ్చాయి. గుంటూరు తూర్పులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అహ్మద్ రెండు సెట్లు, ఇండిపెండెంట్‌లుగా షేక్ ముంతాజ్, సయ్యద్ జావెద్, మొహమ్మద్ రఫీ షేక్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నుంచి షేక్ అల్తాఫ్ హుస్సేన్ నాలుగు సెట్లు, కాంగ్రెస్ పార్టీ తరుపున షేక్ మస్తాన్‌వలి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నుంచి బాషా సాహెబ్ నాలుగు సెట్లు, టీడీపీ తరుపున గల్లా మాధవి, టీడీపీ తరుపునే డమ్మీగా గల్లా రామచంద్రరావు, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి నుంచి తాతా సేవకుమార్, ఇండియన్ లేబర్ పార్టీ నుంచి రాయపూడి జీవన్ పెర్సిస్, ఇండిపెండెంట్‌గా షేక్ ముంతాజ్ నామినేషన్లు వేశారు.

తాడికొండ నియోజకవర్గంలో శృంగారపాటి బాబురావు(బీఎస్పీ), రమేష్‌బాబు తెనాలి(జాతీయ జనసేన పార్టీ), మేకతోటి సుచరిత (వైసీపీ) రెండు సెట్లు, దివ్య వాణి కొప్పుల(ఇండిపెండెంట్) నామినేషన్లు దాఖలు చేశారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి వలపర్ల కిషోర్(ఇండిపెండెంట్), రావూరి కిషోర్‌బాబు (ఇండిపెండెంట్), యాసిన్(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), జొన్నా వెంకటేశ్వర్లు(సీపీఎం), వినయ్‌కుమార్ తంబి యమ్మిల (ఇండిపెండెంట్), లోకేశ్ నారా (టీడీపీ), చదలవాడ వెంకట రమేష్ (ఇండిపెండెంట్), రామచంద్ర బోడే(భారత చైతన్య యువజన పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు. పొన్నూరు నుంచి రోశయ్య వరికుంట(జైభారత్ నేషనల్ పార్టీ), మురళీకృష్ణ అంబటి(వైసీపీ), జక్కా రవీంద్రనాథ్(కాంగ్రెస్), తెనాలి నుంచి అమానుల్లా ఖాన్ పఠాన్(ఇండియన్ ముస్లిం లీగ్), షేక్ బషీద్(కాంగ్రెస్), ప్రత్తిపాడులో బెజ్జం నాగరాజు(ఇండిపెండెంట్), బూర్ల రామాంజనేయులు(టీడీపీ), బలసాని కిరణ్‌కుమార్(వైసీపీ) నామినేషన్లు దాఖలు చేశారు.

పది ఫలితాల్లో సత్తాచాటిన మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులు

● ఎస్‌బీఎన్‌ఆర్ స్కూల్ విద్యార్థికి అత్యధికంగా 582 మార్కులు



బి.శైలజ



ఫాతిమా తబస్సుమ్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 21 : పదవ తరగతి ఫలితాల్లో నగరంలో ని మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులు సత్తాచాటారు. ఒక్కో పాఠశాలలో కనీసం సగటున 75 నుంచి 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ఎన్జీవో కాలనీలో ఎస్‌కేబీపీఎం స్కూల్ 93 శాతం ఫలితాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ పాఠశాల నుంచి 116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 108 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలకు చెందిన బి.శైలజ 571 మార్కులతో పాఠశాల స్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. స్తంభాలగరువు లోని ఎస్‌సీఎంపీఎంసీ నుంచి 178 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 151 మంది (86శాతం) ఉత్తీర్ణులయ్యారు. స్వర్ణాంధ్రనగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ నుంచి 21 మంది పరీక్షరాగా వారిలో 18 మంది (86శాతం) ఉత్తీర్ణులయ్యారు. కొత్తపేటలోని ఎస్‌జేఆర్‌ఆర్‌ఎంసీహెచ్ నుంచి 133 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 111 మంది (83శాతం) ఉత్తీర్ణులయారు. ఏటి అగ్రహారంలోని ఎస్‌కేబీఎంఎం స్కూల్ నుంచి 192 మంది పరీక్ష రాయగా వారిలో 151 మంది (79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. నవభారత్‌నగర్‌లోని ఎస్‌బీఎస్‌ఆర్ ఎంసీ నుంచి 84 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 65 మంది (77 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి హాజరైన ఫాతిమా తబస్సుమ్ అనే విద్యార్థిని అత్యధికంగా 582 మార్కులు సాధించి నగరంలోనే టాప్‌గా నిలిచారు. ఇక రవీంద్రనగర్ లోని పీఎంసీ నుంచి 112 మంది పరీక్ష రాయగా వారిలో 85 మంది (76శాతం) ఉత్తీర్ణులయ్యారు. కొత్తపేటలోని ఎస్‌కేఎస్‌ఎంసీ నుంచి 80 మంది పరీక్ష రాయగా వారిలో 61 మంది (76శాతం) ఉత్తీర్ణులయ్యారు. భారత్‌పేటలోని మున్సిపల్ స్కూల్ నుంచి 34 మంది పరీక్ష రాయగా వారిలో 26 మంది (76శాతం) ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ఎస్‌జిఎస్‌కె నుంచి 143 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 102 మంది(71శాతం) ఉత్తీర్ణుల య్యారు. గుజ్జనగుండ్లలోని మున్సిపల్ స్కూల్ నుంచి 51 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 36 మంది (71శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆర్ అగ్రహారంలోని కెఎస్‌ఆర్ మున్సిపల్ స్కూల్ నుంచి 99 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 64 మంది(65శాతం) ఉత్తీర్ణత సాధించారు. కేవీపీకాలనీలోని కేఎస్‌ఆర్‌టి స్కూల్ నుంచి 54 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 35 మంది (65శాతం) ఉత్తీర్ణత సాధించారు. సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ పినపాటి ప్రభుదాస్ మున్సిపల్ స్కూల్ నుంచి 88 మంది పది పరీక్షకు హాజరుకాగా వారిలో 52 మంది (58శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆయా పాఠశాలల్లో 500పైన మార్కులు సాధించిన విద్యార్థులు పదుల సంఖ్యలో ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అంజయ్య తదితరులు

పది ఫలితాల్లో సత్తాచాటిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 22 : పాఠశాల విద్యా శాఖ విడుదల చేసిన పది ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు కోట వాసవి నాగ రాఘుశ్రావ్య 595 మార్కులు(నగరాలు బ్రాంచి), కె.భవాని 594 మార్కులు(నవభారత్ బ్రాంచి), కె.వరుణ్ తేజ్ 593, ఎం.కౌషికా, వై.యశస్వి 592 మార్కులు సాధించారు. ఇంకా జి.సాయిమహేష్ అక్షయ్ 591 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపల్ రాధిక, శివప్రసాద్, కో ఆర్డినేటర్స్ ఏఎస్ఎన్ మూర్తి, డీన్స్ రంజిత్, కేటీఎస్ ప్రసాద్, ఏవో శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

సెయింట్ లారెల్స్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 22 : పదిలో స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కార్యదర్శి మేకల రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థి ఎండీ గౌస్ 582 మార్కులు, ఎం.షాహేషతహేసీన్ 588, దీదిపాయ్ 586, జి.వంశీప్రియ 583, కె.షోహిత్‌కుమార్, పి.అజియా హుమేరా 582 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 550కి పైగా మార్కులు 24 మంది, 500 మార్కులపైగా 57 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను కార్యదర్శి రవీంద్రబాబు తదితరులు అభినందించారు.

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22: వైసీపీ అధికారంలోకి రాగానే మైనార్టీ సంక్షేమం పూర్తిగా అడుగంటిపోయిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి విమర్శించారు. నగరంపాలెంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అందరికీ ఇస్తున్న పథకాలనే ముస్లింలకు ఇస్తూ మైనార్టీ సంక్షేమానికి తమ పార్టీ ఎనలేని కృషి చేసిందని వైసీపీ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, చివరకి ఉర్దూ అకాడమిని కూడా నాశనం చేశారని మండిపడ్డారు. ముస్లింల అభివృద్ధికి నిర్దిష్టమైన పథకాలను అమలు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని గుర్తు చేశారు. అందుకే టీడీపీకి మద్దతు ఇచ్చి, ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి కృషి చేయనున్నట్లు ఖాజావలి ప్రకటించారు.

ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న అప్పిరెడ్డి తదితరులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22 : క్రీడల్లో అద్భుత ప్రతిభ చూపిన క్రీడాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఈనెల 14న ఢిల్లీలో జరిగిన జాతీయ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో అండర్-10 విభాగంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ నగరానికి చెందిన రాజా మినాక్షీ, ప్రజ్ఞ, కారుణ్య, ధనుశ్రీలు బంగారు, కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బీ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, సాహితిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండి అశోక్‌రెడ్డి, కార్యదర్శి పల్లెల శేఖరరెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.



పూలరథంపై నామినేషన్ వేయడానికి వెళుతున్న తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్, ప్రక్కన మాజీ ఎమ్మెల్యే సుభాని, జనసేన నగర అధ్యక్షుడు సురేష్ తదితరులు

నామినేషన్‌తోనే గెలుపు ఖాయం

● తూర్పు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు నియోజకవర్గం తరుపున నామినేషన్ వేయడంతోనే తన గెలుపు ఖాయమైపోయిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. తొలుత బీఆర్ స్టేడియం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుకపడిపోయిన రాష్టాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలంటే నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని నసీర్ పేర్కొన్నారు. అందుకే ప్రజలంతా కూటమి పాలననే కోరుకుంటున్నారని తెలిపారు. నామినేషన్ కార్యమానికి స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రజలు సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు నంబూరు సుభాని, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, పార్టీ నాయకుడు భారత్ రెడ్డి, గౌస్, జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, బీజేపీ నాయకులు వనమా నరేంద్ర, వేములకొండ శ్రీనివాస్, కార్పొరేటర్లు పోతురాజు సమతా, ఖాజా మొహిద్దీన్ చిష్టి, షేక్. మీరావలి పాల్గొన్నారు.



నసీర్ నామినేషన్‌కి తరలివచ్చిన టీడీపీ శ్రేణులు, అభిమానులు

విశ్వబ్రహ్మణులకు సముచిత స్థానం

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22: అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించి, పార్టీ పరంగా అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ అన్నారు. సోమవారం స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు, సంఘ సభ్యులు కలిసి తాడిశెట్టి మురళీమోహన్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతరం తాడిశెట్టి మురళీ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. విశ్వబ్రాహ్మణ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ విశ్వబ్రాహ్మణులకు చట్టసభలో ఒక్క సీటు కూడా కేటాయించకపోవటంతో స్వతంత్ర్య అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణ యించుకున్నామని, టీ డీ పీ ఇచ్చిన హామీతో ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ తమ సామాజికవర్గానికి న్యాయం చేస్తుందనే నమ్మకంతో టీడీపీలో చేరినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయానికి విశ్వబ్రాహ్మణులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. టీడీపీలో చేరిన వారిలో రెడ్డిపాలెం మాజీ ఉపసర్పంచ్ తాళ్ల సాంబశివరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు యు.నాగేశ్వరాచారి, వెంకట లక్ష్మణచారి, మహేశ్వరాచారి, గురుబ్రహ్మం ఉన్నారు.



టీడీపీలో చేరిన వారితో తాడిశెట్టి మురళీ మోహన్ తదితరులు

డాక్టర్ తాతా సేవకుమార్ నామినేషన్ దాఖలు

గుంటూరు, ఏప్రిల్ 22 : ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ అభ్యర్థిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు డాక్టర్ తాతా సేవకుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కే.రాజ్యలక్ష్మికి ఆయన తన నామినేషన్ అందజేశారు. అనంతరం డాక్టర్ సేవకుమార్ మీడియాతో మాట్లాడుతూ పదవుల కోసం, ధన సంపాదన కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని తెలిపారు. భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లను కలుస్తానని డాక్టర్ తాతా సేవకుమార్ ప్రకటించారు.

తూర్పులో మస్తాన్‌వలి...

గుంటూరు, ఏప్రిల్ 22 : తూర్పు నియోజవకర్గం ఇండియా కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. పాతగుంటూరు మణిహోటల్ సెంటర్ నుంచి ర్యాలీగా బస్టాండ్ ఎన్‌టీఆర్ సర్కిల్, జిన్నాటవర్ సెంటర్, హిమనీ సెంటర్ వరకు కార్యకర్తలతో ర్యాలీగా సాగారు. కేంద్ర మాజీ మంత్రి పళ్ళం రాజు, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు పలువురు నాయకులతో కలిసి మస్తాన్‌వలి నామినేషన్ దాఖలు చేశారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
8
గుంటూరు జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో కోలాటం ఆడుతున్న మహిళలు

నాయకా.. ఏమి నీ అలక..!



- పార్టీకి దూరంగా ఉంటున్న నాయకులపై నేతల దృష్టి
- ట్రబుల్ షూటర్స్‌ను రంగంలోకి దింపుతున్న పార్టీలు
- నయానో భయానో ఒప్పించడానికి ముమ్మరంగా ప్రయత్నాలు
- గతాన్ని గుర్తు చేస్తూ బెట్టు చేస్తున్న నాయికాగణం

బాపట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రకరకాల కారణాలతో పార్టీకి దూరంగా ఉంటున్నవారిని నేతలు ఇన్ని రోజులూ లైట్ తీసుకున్నారు. కానీ ఎన్నికల సమయం కావడంతో వారి అలకలపై ప్రత్యేకంగా రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. వారిని శాంతింపజేసి తిరిగి పార్టీకోసం పనిచేసే విధంగా వారిని ఒప్పించడానికి నిష్ణాతులైన ట్రబుల్ షూటర్స్‌ను నేతలు రంగంలోకి దింపారు. వీరి అండతో వారి అలకలకు విరుగుడు కనుక్కునే కార్యక్రమాన్ని నేతలు ముమ్మరం చేశారు. తృణమో, పణమో ఇచ్చయినా సరే వారిని మళ్లీ పార్టీలో యాక్టివ్ అయ్యేలా చూసి పదోపరకో ఓట్లు పంట పండించుకోవాలి.. ఇదే నేతల తక్షణ కర్తవ్యం.

అప్పుడు పట్టించుకోలేదు...

పార్టీ పరిస్థితిపై నెత్తీనోరు కొట్టుకుని చెప్పినా అప్పుడు వినలేదు. ఇప్పుడు ఎందుకు వచ్చారు. అలకబూనిన ఓ నేత మాటలివి. అప్పుడంటే ఆయన మాటలతో విభేదించారు కానీ ఇప్పుడు ఆ అవకాశం లేదాయె. సదరు నేత చెప్పిన ప్రతి మాటను స్కూల్‌కు వెళ్లే పిల్లాడిలా శ్రద్ధతో ఆలకిస్తున్నారు నేతలు. ఎందుకంటే వచ్చిన పనికావడం ముఖ్యం కనుక. అప్పుడంటే ఎన్నికలు లేవు కనుక పార్టీకి దూరంగా ఉంటానని అలకబూనినా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడంటే ఎన్నికలు తప్పదు మరీ.

ట్రబుల్ షూటర్స్‌కు డిమాండ్...

ఓ ఊరులోనో, కాలనీలోనే పెద్దమనిషి తరహాలో ట్రబుల్ షూటర్స్‌గా కొంతమంది కీర్తి గడించి ఉంటారు. వీరి అవసరం ఎన్నికల వేళ నేతలకు వచ్చి పడింది. అలకలు, పట్టుదలతో పార్టీకి దూరంగా ఉంటున్న వారిపైకి తొలుత ట్రబుల్ షూటర్స్‌నే ప్రయోగిస్తున్నారు. వారితో మాటామంతీ పూర్తయిన తర్వాత కానీ సదరు అగ్రనేత రంగప్రవేశం జరగడం లేదు. నేరుగా నేతే అలకబూనిన వారి దగ్గరకు వెళితే ముఖానే తలుపు వేస్తే ఎన్నికల వేళ సదరు నేతల పరువు ఏం కానూ.. అందుకు మొదట ట్రబుల్ షూటర్స్ ప్రయోగం.. ఆనక కథానాయకుడు ఎంట్రీతో కథ తిరిగి పార్టీ గూటికి చేరుతోంది.

పదవులు మొదలు.. పైకం వరకూ..

అలకబూనిన నేతలను దారికి తెచ్చుకోవడానికి అప్పుడే నామినేటెడ్ పదవుల పందేరంతో పాటు స్థానిక సంస్థల పదవుల పంపకం కూడా జోరుగా సాగుతోంది. అన్నీ పార్టీల్లో ఇదే తంతు. ఇదెలా సాధ్యం గెలిచేది ఒక్కపార్టీనే కదా.. అందరికీ న్యాయం ఎలా జరుగుతుందనే ధర్మసందేహాలు ఎన్నికల వేళ అసలు రాకూడదు.. గెలిచేసినట్లు.. పదవులు వరించినట్లు నేతలు వారికి అరచేతిలో త్రీడీ సినిమా చూపిస్తారు. వారు దానిని నమ్మి అలకపాన్పు వీడి పార్టీ గెలుపుకోసం పనిచేయాల్సిందే. ఫలితాలు వచ్చాక తర్వాత సంగతి.

అవమానాలను నేతల ముందు ఏకరువు...

ఎన్నికలప్పుడు చూసుకోవచ్చులే అనే ధీమాతో నేతాగణం కూడా దురుసుగా మాట్లాడి చాలామందిని పార్టీకి దూరం చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఇప్పుడు గత్యంతరం లేని పరిస్థితుల్లో వారి గడప తొక్కాల్సిన అగత్యం నేతాగణానిది. ఇదే అదనుగా అప్పుడు తమకు ఎదురైన అవమానాన్ని నేతల ఎదురుగానే కడిగిపారేసి తమ ఆక్రోశాన్ని తీర్చేసుకుంటున్నారు అలకబూనిన నేతలు. అంటే అన్నారులేగాని పార్టీలోకి వచ్చి గెలుపు కోసం పని చేస్తే అదే పదివేలు అన్న చందాన నేతలు సర్దుకుపోతున్నారు.

మాకేంటి అనే పంథా కొందరిదీ....


పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ దూరం జరిగిన వారు నేతల కొద్దిపాటి బుజ్జగింపు లతోనే ఓ మెట్టు దిగి వెంటనే ప్రచారానిక సై అంటున్నారు. మరి కొంతమంది మా త్రం అలకపాన్పు వీడాలంటే నేతలు కట్నం చదివించాల్సిందే అని పట్టుబడుతున్నారు. అదికూడా మరీ ఎక్కువగా ఉండడంతో నేతలు అవాక్కవుతున్నారు. అలా అని చెప్పి వారి మానాన వారిని అలకలకు వదిలేయలేరు. నయానో భయానో ఒప్పించి మళ్లీ పార్టీ జెండా కప్పి ఓసారి జిందాబాద్ కొట్టించుకుంటేనే నేత మనసు కుదుటపడని పరిస్థితి. ఎందుకంటే ఎన్నికలు సమయం కదా... తప్పదు అలకలు తీర్చాలిందే... అందుకు అవసరమయ్యే నజరానాలు అందించాల్సిందే..!



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో పవన్‌కల్యాణ్, కృష్ణ, బాలకృష్ణ వేషధారణలో కళాకారులు



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో పూలు జల్లుతున్న డ్రోన్



పెమ్మసాని నామినేషన్ ర్యాలీలో అభిమానులపై పూల వర్షం కురిపిస్తున్న డ్రోన్



పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవిల నామినేషన్ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



పెమ్మసాని చంద్రశేఖర్, గల్లా మాధవి నామినేషన్ ర్యాలీలో ఆకాశంలో ప్యారా గ్లైడ్ చేస్తున్న టీడీపీ అభిమానులు

నామినేషనోత్సవాలు

మండే ఎండలో.. జన హోరు.. జోరు మధ్య సోమవారం కూటమి తరఫున పోటీ చేసే టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కూటమి శ్రేణుల జయజయధ్వానాలు.. టపాకాయలు, తీన్‌మార్ శబ్ధాల మధ్య అభ్యర్థులు ర్యాలీలతో ఆయా నియోజకవర్గ కేంద్రాలు హోరెత్తిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు అభ్యర్థులకు ఎక్కడికక్కడ ఘన స్వాగతం పలికి ఆర్‌వో కేంద్రాల వరకు తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేయించారు. మార్గమధ్యలో మహిళలు దిష్టితీసి అభ్యర్థులకు వీర తిలకాలు దిద్దారు. కళాకారుల ప్రదర్శనలు, మహిళల నృత్యాలు, యువత సందడితో ర్యాలీలు ఆకట్టుకున్నాయి. దారిపొడవునా పార్టీ శ్రేణులు, మహిళలు అభ్యర్థులకు నీరాజనాలు పలికారు. గుంటూరులో లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థిలు మాధవి, నసీర్‌లు భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడులో బూర్ల రామాంజనేయులు, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ, గురజాలలో యరపతినేని శ్రీనివాసరావు, వేమూరులో నక్కా ఆనందబాబు, బాపట్ల జిల్లా పర్చూరులో ఏలూరి సాంబశివరావు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు.

\- గుంటూరు, ఆంధ్రజ్యోతి



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు



పెమ్మసాని నామినేషన్‌లో బొమ్మల ఎద్దులతో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ అభిమానులు



సత్తెనపల్లి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ ర్యాలీలో తెలంగాణా డప్పు కళాకారులతో కలసి పాల్గొన్న పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, తెలుగు మహిళలు



పెమ్మసాని, మాధవి నామినేషన్ ర్యాలీలో విచిత్ర వేషధారణలో కళాకారులు



వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న రాజస్థాన్ బ్యాండ్ కళాకారులు

- ఆ ముగ్గురు నేతలు ఎమ్మెల్యే.. ఎంపీగా విజయం సాధించారు
- నరసరావుపేట లోక్‌సభ.. అసెంబ్లీ నుంచి..

కాకలు తీరిన నేతలు


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట నియోజకవర్గం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ముగ్గురు నేతలు నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీచేసే అవకాశం దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా.. ఎంపీగా గెలుపొందిన ఘనత సాధించారు. కాకలు తీరిన రాజకీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నరసరావుపేట లోక్‌సభ, అసెంబ్లీ రెండింటికీ ఎన్నికయ్యారు. కాసు బ్రహానందరెడ్డి 1967లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలు అందజేశారు. 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధించారు. వరుసగా మూడవ సారి 1984లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాటూరి నారాయణస్వామి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తదుపరి బ్రహ్మానందరెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఎంపీగా బ్రహానందరెడ్డికి హ్యాట్రిక్ చేజారింది.

1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గం నుంచి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



కాసు బ్రహ్మానందరెడ్డి



చాపలమడుగు రామయ్య చౌదరి



కాసు వెంకటకృష్ణారెడ్డి

కాసు బ్రహ్మానందరెడ్డి వారసుడిగా రాజకీయాల్లో అడుగిడిన కాసు వెంకటకృష్ణారెడ్డి నరసరావుపేట నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978లో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన కాసు కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ కాలంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. 1989, 1991లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకటకృష్ణారెడ్డి వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి ఎంపీగా ఎన్నికయ్యారు. 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోట సైదయ్య చేతిలో పరాజయాన్ని చవిచూసిన ఆయన హ్యాట్రిక్ విజయాన్ని చేజార్చుకున్నారు. 1985, 1999 ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కాసు.. కోడెల చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు కాసు వెంకటకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై పలు మంత్రి పదవులను నిర్వహించారు. కాసు కృష్ణారెడ్డి రెండుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా నరసరావుపేట నుంచి గెలు పొందారు.

ఇక్కడి నుంచి రెండు సార్లే ఛాన్స్

నరసరావుపేట లోక్‌సభ నుంచి ఎవర్కైనా రెండు సార్లు గెలిచే అవకాశాన్ని ఓటర్లు ఇచ్చారు. హ్యాట్రిక్ బరిలో దిగిన నేతలను ఓడించిన ఘనత ఇక్కడ ఓటర్లది. 1967, 1971 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నరసరావుపేట లోక్‌సభ నుంచి పోటీచేసి అత్యధిక మెజారిటీతో మద్ది సుదర్శనం గెలుపొందారు. ఆయనకు మూడవసారి ఇక్కడి నుంచి పోటీచేసే అవకాశం దక్కలేదు. 1977, 1980 ఎన్నికల్లో పోటీచేసిన కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. 1984 మూడవ సారి ఇక్కడ నుంచి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. అలాగే ఆయన వారసుడు కాసు వెంటక కృష్ణారెడ్డి కూడా 1989, 1991 ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు మాత్రమే ఎన్నికయ్యారు. 1996లో హ్యాట్రిక్ బరిలో దిగిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఓటమి చెందారు.

- 2004 ఎన్నికల్లో చిలకలూరిపేటలో విచిత్ర పరిస్థితి
- పార్టీ టికెట్ ఇచ్చి... ఆ అభ్యర్థికి ఓటు వేయవద్దని ప్రచారం

మా అభ్యర్థే..

కానీ ఓటెయ్యొద్దు

చిలకలూరిపేట, ఏప్రిల్ 22: ఎన్నికల్లో పోటీచేసే పార్టీ అభ్యర్థిని ప్రకటించారు. బీఫారం కూడా ఇచ్చారు. నామినేషన్ల పర్వం పూర్తయింది. బ్యాలెట్ పేపర్‌లో పార్టీ గుర్తు కేటాయింపు కూడా జరిగింది. అయితే ఆ అభ్యర్థికి మాత్రం ఓటు వేయవద్దంటూ పార్టీ నాయకులే ప్రచారం చేసిన పరిస్థితి. ఇది 2004 ఎన్నికల్లో చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగింది. ఆ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గం గుంటూరు పార్లమెంటు పరిధిలో ఉంది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రాయపాటి సాంబశివరావు పోటీలో ఉన్నారు. చిలకలూరిపేట అసెంబ్లీ కాంగ్రెస్ సీటును రాయపాటి సూచన మేరకు పట్టణానికి చెందిన సీనియర్ కళాకారుడు మల్లాది శివన్నారాయణకు కేటాయించారు. 1978 నుంచి చిలకలూరిపేట కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడుగా ఉండి ఆరుసార్లు అసెంబ్లీకి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన సోమేపల్లి సాంబయ్య వర్గానికి కాకుండా వేరొకరికి టికెట్ ఇవ్వడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో తమ వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. అప్పుడు సాంబయ్య కుటుంబానికి చెందిన మర్రి రాజశేఖర్‌ను ఇండిపెండెంట్ గా నామినేషన్ వేశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ఈ నియోజకవర్గానికి వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు తమ అసంతృప్తి ఆయన ఎదుట బహిరంగంగా వ్యక్తం చేశాయి. పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. దీనితో కాంగ్రెస్ నాయకత్వం పరిస్థితిని గమనించి మల్లాది శివన్నారాయణను పోటీ నుంచి తప్పించింది. శివన్నారాయణ తాను పోటీ నుంచి విరమించుకుంటున్నానని, కాంగ్రెస్ శ్రేణులు మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకత్వం కూడా చిలకలూరిపేటలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయవద్దని, మర్రి రాజశేఖర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది. రైలింజన్ గుర్తుతో రాజశేఖర్ ఎన్నికల్లో పోటీ చేసి కేవలం 212 ఓట్ల ఆధిక్యతతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. చిలకలూరిపేట చరిత్రలో ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి ఎన్నికల్లో గెలవడం అదే తొలిసారి. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బ్యాలెట్‌లో పేరు ఉన్న మల్లాది శివన్నారాయణకు 7,841 ఓట్లు రావడం విశేషం.



మర్రి రాజశేఖర్



మల్లాది శివన్నారాయణ

నామినేషన్‌లకు తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు



కాకుమాను మండలం కొమ్మూరు నుంచి తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

కాకుమాను, ఏప్రిల్ 22: మండల వ్యాప్తంగా సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులు నామినేషన్‌లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మండల పరిధిలోని కొమ్మూరులో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా ప్రత్తిపాడు, గుంటూరుకు తరలివెళ్లారు. అలాగే కాకుమానులో పార్టీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి బైక్ ర్యాలీలో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు.

పెదనందిపాడు, ఏప్రిల్ 22: గుంటూరు, ప్రత్తిపాడు కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులుల నామినేషన్‌లకు పెద్ద సంఖ్యలో సోమవారం మండలంలోని ఆయా గ్రామాల నుంచి తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, కార్లు సైతం ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీతో ప్రత్తిపాడు, గుంటూరులకు తరలి వెళ్లి కూటమి అభ్యర్థులకు తమ మద్దతు తెలిపారు.

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 22: గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని, ప్రత్తిపాడు ప్రత్తిపాడు నియోజక అభ్యర్థి బి.రామాంజనేయులు సోమవారం నిర్వహించిన నామినేషన్‌ల కార్యక్రమానికి మండలపరిధి గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలతో కదం తొక్కారు. భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో గుంటూరు బైపాస్ రోడ్డు నుంచి ప్రత్తిపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ట్రాఫిక్ స్థంభించి పోయింది.

తుళ్లూరులో బైకులు, ఆటోలు, కార్లతో ర్యాలీ



పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్‌కు బైకులుపై తుళ్లూరులో ర్యాలీ చేస్తున్న తెలుగు యువత కార్యకర్తలు

తుళ్లూరు, ఏప్రిల్ 22: గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్ కార్యక్రమానికి రాజధాని గ్రామాల నుంచి సోమవారం భారీ సంఖ్యలో తెలుగుయువత సభ్యులు కదిలారు. తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ తెలుగుయువత మండల మాజీ అధ్యక్షుడు నెలకుదిటి చంద్రశేఖర్ (చందు) ఆధ్వర్యంలో యువత కార్యకర్తలు నామినేషన్‌కు వెళ్లబోయే ముందు బైకులు, ఆటోలు, కార్లతో తుళ్లూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ పిలుపు మేరకు పెమ్మసాని నామినేషన్‌కు యువత కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలారని అన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో రాష్ట్రంలో గెలవబోతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు యువత భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల నామినేషన్‌లకు స్వచ్ఛందంగా జనం వచ్చారన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మంగళగిరి, ఏప్రిల్ 22: మండలపరిధి చినకాకాని మురుగన్ హోటల్ సమీపంలో సైడుకాల్వలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అయిదారు రోజుల క్రితమే చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు అనారోగ్యంతో చనిపోయాడా, ప్రమాదవశాత్తూ మృతి చెందాడా లేక ఎవరైనా చంపి పడవేసి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి ఘటనలో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 22: సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్డులో ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన వ్యక్తి మృతి చెందిన ఘటనలో ఇద్దరిని తాడేపల్లి పోలీసులు అరెస్టు చేసి ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 19వ తేదీ సీఎస్ఆర్ కల్యాణ మండపం రోడ్డులో వైసీపీ ప్రచార సమయంలో ఆ పార్టీ కార్యకర్త వెంకటరెడ్డిని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంతో ఢీకొట్టగా చికిత్స పొందుతూ వెంకటరెడ్డి ఈ నెల 20 మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం ప్రమాదం కేసు నుంచి ఉద్దేశపూర్వకంగా వాహనంతో ఢీకొట్టారంటూ హత్య కేసుగా మార్పు చేసి ఘటనకు కారకులైన మహానాడుకు చెందిన గురువర్ధన్, బాలేశ్వర్‌లను తాడేపల్లి పోలీసులు అరెస్టు చేసి ఆదివారం సాయంత్రం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా ఆయన వారికి రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారని తాడేపల్లి పోలీసులు తెలిపారు.

పెదరావూరు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 22: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నట్లు త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వరావు చెప్పారు. మండలపరిధిలోని పెదరావూరు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద కోఆపరేటివ్ అసిస్టెంటు రిజిస్ట్రార్ ఎ.రాధాదేవి, త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వరావు సిబ్బందితో వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధలను పాటించాలని, వాటిని అతిక్రమించి వాహనాల్లో నగదు, మద్యం తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ టీమ్, త్రీటౌన్ పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీకే ఓట్లు వేయండి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



నుదురుబాడులో రోడ్ షోలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్ కుమార్‌లు

ఫిరంగిపురం, ఏప్రిల్ 22 : రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉండాలంటే టీడీపీకే ఓట్లు వేసి గెలిపించాలని గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వేమవరం, నుదురుపాడు, కండ్రిక గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన రోడ్డులో షోలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదు సంవత్సరాల పాలన, గత టీడీపీ పాలనను ప్రజలు పోల్చుకోవాలని కోరారు. నుదురుపాడు గ్రామం వైసీపీకి పట్టు ఉన్న గ్రామం. ఐతే ఇటీవల టీడీపీ ద్వారాన్ని వైసీపీ వారు పడగొట్టారని తెలిసిందని, టీడీపీ కార్యకర్తల కోసం తాను ఎంత నష్టపోయినా అండగా ఉంటానని, దౌర్జన్యకరమైన పనులు చేస్తే సహించేది లేదన్నారు. ధర్మం వైపు, న్యాయం వైపు ఉండాలని కోరారు. గ్రహాలు తిరుగుతుంటాయని, ఓడిన పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. గల్లీగల్లీలో పార్టీలకు అతీతంగా సిమెంట్ రోడ్లు తెలుగుదేశం హయాంలోనే వేశారన్నారు. వైసీపీకి అసలు ఓట్లు ఎందుకు వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాజధాని లేకున్నా పర్వాలేదా?, పోలవరం కట్టకున్నా ఓకేనా?, మీ ఆస్తులు రిజిస్టర్ కార్యాలయంలో మీ పేరుపై లేకున్నా పర్వాలేదా?, మీ పిల్లలకు ఉద్యోగం లేకున్నా ఏం బాధ లేదా?, పరిశ్రమలు లేకుండా చేసినా మీకు సమ్మతమేనా?, మీ పిల్లలు గంజాయికి బానిలైనా ఓకేనా?, రోడ్లు గుంతలు పడి ప్రయాణిస్తూ మరణించినా మంచిదేనా?, మంచినీటి సరఫరా లేకున్నా, ఇసుక, మట్టి దందా చేసినా ఓర్చుకుంటారా?, వలంటీర్లు రూ.5వేలు తీసుకొని బానిసల్లా బతుకులు ఈడుస్తారా? అంటూ స్థానిక ప్రజలను ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కళ్ళు తెరచి నిజాలు గ్రహించాలన్నారు. జరగబోయే ఎన్నికలు సజావుగా జరిగేట్టు చూడాలని ఆయన కోరారు. శాంతిని, మంచిని, అభివృద్ధిని, సంక్షేమాన్ని కోరుకొనే వ్యక్తులను గెలిపించాలని ఆయన కోరారు. తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముందుగా కనక తప్పెట్లతో డ్యాన్స్‌లు, వందలాది మంది యువత బైక్ ర్యాలీ, వందలాది మంది రోడ్ షోకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, కంభం పెదబాబు, ఆళ్ళ కృష్ణమూర్తి, రామిరెడ్డి, డీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, కొల్లి శివారెడ్డి, గుర్రాల శివయ్య, నలజర్ల అప్పయ్య, చెక్కా హనుమంతరావు, టీ లూర్దయ్య, కే యోహాన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మండల స్థాయిలో అత్యధికంగా ఇద్దరు విద్యార్థులు మార్కులను సాధించారు. చినకాకాని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కమ్ములూరి సాత్విక, మంగళగిరి శ్రామికనగర్‌లోని బీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎస్‌డీ మొహమ్మద్, నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కే.జాన్సన్, మంగళగిరి వీవర్స్ కాలనీ హైస్కూల్ విద్యార్థులు దామర్ల శివ, కాకుమాను ధన్వి ఉన్నత శ్రేణిలో నిలిచారు. ఎర్రబాలెం డాన్‌బోస్కో హైస్కూల్ 89శాతం, నవులూరు జడ్పీహెచ్ ఎస్ 54, ఆత్మకూరు జడ్పీహెచ్ఎస్ 61, నిడమర్రు జడ్పీహెచ్ఎస్ 57, చినకాకాని జడ్పీ హెచ్ఎస్ 59, పెదవడ్లపూడి జడ్పీహెచ్ఎస్ 87, పెదవడ్లపూడి ఏటీపీఎం హైస్కూల్ 44, నూతక్కి జడ్పీహెచ్ఎస్ 92, మంగళగిరి వీవర్స్ కాలనీ హైస్కూల్ 76, సీకే హైస్కూల్ 70, సీకే బాలికోన్నత పాఠశాల 85, శ్రామి కనగర్ బీఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు 91శాతం ఉత్తీర్ణ సాధించినట్టు ఎంఈవోలు జీ.సత్యనారాయణ, ఎన్ బాబు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 893 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 642 మంది ఉత్తీర్ణత సాధించారు.

● ప్రైవేటు పాఠశాలల విషయానికొస్తే పెదవడ్లపూడి విజేత హైస్కూల్ విద్యార్థిని షేక్ నజ్మ మండల టాపర్‌గా నిలిచింది. మరో విద్యార్థిని జంజనం గీతిక అత్యధిక మార్కులు సాధించింది. మొత్తం 131 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 56 మందికి 500లకు పైగా మార్కులు సాధించినట్టు పాఠశాల యాజమాన్యం తెలిపింది. పెదవడ్లపూడి నాగార్జున హైస్కూల్ విద్యార్థిని వి.గీతశ్రీ, కే.నాగదీపిక, బి.ప్రణతి, జీ.శ్రీలక్ష్మీ మధులిక అత్యధిక మార్కులు సాధించినట్టు పాఠశాల డైరెక్టర్ జే.రాఘ వయ్య, ప్రిన్సిపాల్ జే.మాధవి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రకటించారు.

వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో 78 శాతం ఉత్తీర్ణత

తాడేపల్లి, ఏప్రిల్ 22: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన పాకనాటి పూజిత ప్రథమ స్థానం పొందింది.

నందిపాఠశాల విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థికి నగదు అందజేస్తున్న పెదనందిపాడు ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

పెదనందిపాడు, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాలల్లో పెదనందిపాడు నంది హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. నూరు శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచారు. 90 శాతం పైగా 13 మంది విద్యార్థులు, 80 శాతం పైగా 12 మంది. 70 శాతం పైగా నలుగురు, 60 శాతం ఇద్దరు విద్యార్థులు ఫలితాలు సాధించారు. ప్రథమ స్థానంలో వై హారిక నిలిచింది. గతంలో కూడా ఈ పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించడమే కాకుండా ప్రత్తిపాడు నియోజకవర్గంలో అగ్రగామిగా నిలిచింది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల సెక్రటరీ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు. అంతే కాకుండా ఉత్తమ సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను పెదనందిపాడు ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నర్రా బాలకృష్ణ, నర్రా వీరయ్య, లావు ఆదిశేషయ్య, హెచ్ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● పెదనందిపాడు మండలంలో బాలికలే ముందంజలో ఉన్నారు. తొమ్మిది పాఠశాలల్లో 185 మంది విద్యార్థులకు గాను 163 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో డి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టీ అభినవ్ మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. యనమదల జడ్పీ పాఠశాలకు చెందిన షేక్ రెహానా, షేక్ నస్రీన్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

దుగ్గిరాల మండలంలో 75శాతం ఉత్తీర్ణత

దుగ్గిరాల, ఏప్రిల్ 22: మండలంలో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవోలు కాజ శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణలు సోమవారం తెలిపారు. మండలంలోని 7 ప్రభుత్వ జడ్పీ పాఠశాలల్లో మొత్తం 651 మంది హాజరుకాగా 488 మంది ఉత్తీర్ణులయ్యారు. దుగ్గిరాల జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని నేలవల్లి మీనాక్షి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది.

మండలంలో 95 శాతం ఉత్తీర్ణత

కాకుమాను, ఏప్రిల్ 22: మండలంలో 97.72 ఉత్తీర్ణత శాతం వచ్చినట్లు ఎంఈవో కేఏఫ్ కెన్నడీ తెలిపారు. మండలంలో మొత్తం 304 మంది పది పరీక్షలకు హాజరు కాగా 291 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చిన్నలింగాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ గౌసియా మండలంలో ప్రథమ స్థానంలో, అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని యోగాన్నయి ద్వితీయ స్థానంలో నిలిచింది.

మండలంలో 88శాతం ఉత్తీర్ణత

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 22: మండల వ్యాప్తంగా వట్టిచెరుకూరు, అనం త వరప్పాడు, గారపాడు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 469 మంది విద్యా ర్థులు హాజరుగాకా 88శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలపరిధిలోని కొర్నెపాడు హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.

●ముట్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గేరా సుధ మండల టాపర్‌గా నిలవగా.. షేక్ బాజీబీ ద్వితీయ, అనంతవరప్పాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్ ప్రియదర్శిని తృతీయ స్థానాలను సాధించారు.

తాడికొండ మండలంలో

తాడికొండ, ఏప్రిల్ 22: మండల పరిధిలోని ఏపీ గురుకుల పాఠ శాల కు చెందిన మణికంఠసాయి మండలంలో ప్రథమ స్థానం, ఏపీ రెసిడెన్షి యల్ పాఠశాలకు చెందిన ఏ.బాలపవన్‌శివ ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ హైస్కూల్ రావెలకు చెందిన ఎం. జానకీరామ్‌తృతీయ స్థానంలో నిలిచారు. నిడుముక్కల జడ్పీ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు 16 మంది, జడ్పీ తాడికొండలో 11 మందికి 9 మంది, ఏపీఆర్ఎస్ఈఎస్ హైస్కూల్ తాడికొండలో 72 మందిలో 71 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీసోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాయ్స్ పాఠశాలల 60మందికి 58మంది, పొన్నెకల్లు జిల్లా పరిషత్ పాఠశా లలో 132మందికి 106మంది, జిల్లా పరిషత్ హైస్కూల్ రావెలలో 80మందికి 60మంది, లాం జిల్లా పరిషత్ హైస్కూల్లో 16మందిలో 12 మంది ఉత్తీర్ణత సాధించారు.

తుళ్లూరు, ఏప్రిల్ 22 : తుళ్లూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 62.8శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 371 మంది పరీక్షలు రాస్తే 233 మంది విద్యార్థులు ఉతీర్ణత చెందారని మండల విద్యా వనరుల కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

భూమాతను పరిరక్షించుకుందాం




అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు

పెదనందిపాడు, ఏప్రిల్ 22: మండలపరిధిలోని అన్నపర్రు జడ్పీ పాఠశాలలో సోమవారం ఏపీ నేషనల్ గ్రీన్ కేర్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో భూమాతను పరిరక్షించుకుందాం అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవ తప్పిదాలతో భూమి మీద జీవరాశులు అంతరించిపోతున్నాయని ప్రకృతి విపత్తులతో భూమి రోజురోజుకు పెరిగి నిప్పుల కొలిమిలా తయారవుతుందని శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని మానవహితం కోసం మాత్రమే వినియోగించాలి అంటూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి వాటిని పరిరక్షించాలి, ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు షేక్ గౌసుల్ మీరా, హెచ్ఎం హాజరయ్య, ఉపాధ్యాయులు, వెంకటేశ్వరరావు, రామారావు, సాంబశివరావు, చంద్రశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రి వద్ద ధరిత్రి దినోత్సవం

తాడేపల్లి, ఏప్రిల్ 22: శ్రీత్రిదండి చినజీయర్ స్వామి వారి మంగళశాసనాలతో మన భూమి మన బాధ్యత అనే నినాదంతో సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రం వద్ద సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం చుట్టు పక్కల ప్రాంతాలలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస్ తరంగణి సంయుక్తంగా మానవాళికి ఎంతో ఉపయోగకరమైన వివిధ రకాల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ, వికాస తరంగిణి మహిళా కార్యకర్తలు కృష్ణ ధర్మ రక్షణ వ్యవస్థాపకులు కెడిఆర్, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీలతో కమిషనర్ సమావేశం



సమావేశంలో పాల్గొన కమిషనర్ నిర్మల్‌కుమార్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 22: ఎంటీఎంసీ పరిధిలోని అందరు ప్లానింగ్ సెక్రటరీలతో తాడేపల్లి కార్యాలయంలో సోమవారం కమిషనర్ నిర్మల్‌కుమార్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లానింగ్ సెక్రటరీలు నియమ నిబంధనలతో తమ విధులు సక్రమంగా నిర్వర్తించాలని అనధికార నిర్మాణాలను, హోర్డింగ్‌లను, ఆక్రమణల ను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ప్రణాళిక, బిల్డింగ్ పీనలైజేషన్ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్న అనుమతి లేని హోర్డింగ్‌లో, బోర్డులను ఉపేక్షించకుండా జరిమానా విధించి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీపీ అశోక్‌కుమార్, టీపీవో రమేష్‌బాబు, పీపీఎస్ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

పెదనందిపాడు, ఏప్రిల్ 22: మండలంలోని ఆయా గ్రామాల నుంచి వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతూనే ఉంది. దీనిలో భాగంగా మండలంలోని మూడు గ్రామాలు జీజీ పాలెంలో 13 మంది, రావిపాడులో 13 మంది, పెదనందిపాడు నుంచి ముగ్గురు వలంటీర్లు సోమవారం ఎంపీడీవో సునీతశర్మకు అందజేశారు. ప్రతిరోజు ఆయా గ్రామాల్లోని వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక ఏం చేయాలో తెలియక తమ గోడును ఎవ్వరికి వెళ్లబుచ్చుకోవాలో తెలియక ఏం చేయని నిరుత్సాహ స్థితిలో రాజీనామాల బాట పడుతున్నారు. రాజీనామా చేయడం ఒక ఎత్తు అయితే ప్రచారంలో పాల్గొనాలి అని నాయకులు హుకుం జారీ చేయడంతో ఏం చేయాలంటూ వారు వాపోతున్నారు.

రేపు ధూళిపాళ్ల నామినేషన్

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 22: పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఈ నెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని చింతలపూడి నరేంద్రకుమార్ స్వగృహం నుంచి ర్యాలీ బయలుదేరనున్నట్లు చెప్పారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

తెనాలిలో మరో రెండు నామినేషన్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ బాషీద్ నామినేషన్ పత్రాలు అందించారు. ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా అమానుల్లాఖాన్ నామినేషన్ పత్రాలు అందించారు. దీంతో తెనాలి అసెంబ్లీకి నామినేషన్ల సంఖ్య ఐదుకు చేరింది.

సామాన్యులను చట్టసభలకు పంపించండి

● నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 22: బడుగు, బలహీన వర్గాల సమస్యలపై గళం వినిపించాలంటే సామాన్యులను చట్టసభలకు పంపించవలసిన అవసరం ఉందని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ అన్నారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జలీల్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం దక్కాలంటే రాబోయే ఎన్నికల్లో నవరంగ్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు సయ్యద్ సైదా, రిజ్వానా, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో నారా లోకేశ్ పర్యటన

మంగళగిరి, ఏప్రిల్ 22: మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గ టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు మంగళగిరి 21వ వార్డు పరిధిలోని కొండపనేని టవర్స్‌లో స్థానికులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4 గంటలకు 30, 31, 32 వార్డుల పరిధిలోని ప్రజలతో పార్కు రోడ్డులో, 5 గంటలకు 27, 29 వార్డుల పరిధిలోని ప్రజలతో టిప్పర్ల బజారులో, 6 గంటలకు 28వ వార్డు, నవులూరు గ్రామ ప్రజలతో బాపనయ్య నగర్ ఉడా కాలనీలో జరిగే రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

వృద్ధులకు, వితంతువులకి రూ.4 వేలు పెన్షన్

● ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీపీ షేక్ రిజ్వానా



తాడికొండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముస్లిం నేతలు

తాడికొండ, ఏప్రిల్ 22: టీడీపీ అధికారంలోకి రాగానే వృద్ధులకు, వితంతువులకి రూ.4వేలు పెన్షన్‌ను అందిస్తామని టీడీపీ మ్యానిఫెస్టోలో తెలిపినట్లు మాజీ ఎంపీపీ షేక్ రిజ్వానా పేర్కొన్నారు. సోమవారం తాడికొండలో టీడీపీ గుంటూరు పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ గనీ ఆధ్వర్యంలో చిన్న మసీదు సెంటర్, ముస్లిం ఏరియాలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిజ్వాన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే 18 సంవత్సరాల నుంచి 58 సంవత్సరాలు ఉన్న మహిళలకు నెలకు రూ.1500లు అందిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం, దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తామన్నారు. ముస్లిం కుటుంబాల్లో ఉపాధి కల్పనలో భాగంగా సబ్సిడి రుణాల రూపంలో అందిస్తామని పేర్కొన్నారు. మే 13న జరిగినే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ జప్రుద్దీన్, షేక్ పర్వేజ్, పంచాయతీ వార్డు మెంబర్ ఖాజావలి, నిడుముక్కల బాషా ముస్లిం యువకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో మూడు నామినేషన్లు దాఖలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 22: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బూర్ల నామినేషన్ దాఖలు చేయగా, వైసీపీ అభ్యర్థిగా బలసాని కిరణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. అంతే కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా గొట్టిపాడు గ్రామానికి చెందిన బెజ్జం నాగరాజు నామినేషన్ దాఖలు చేశారు.

వైసీపీ అభ్యర్థి సుచరిత నామినేషన్

తాడికొండ, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల దాఖల కు ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల దాఖలు ఐదోరోజు సోమవారం వైసీపీ నుంచి మేకతోటి సుచరిత, బీఎస్పీ నుంచి శృంగారపాటి బాబూరావు, స్వతంత్ర్య అభ్యర్థిగా కొప్పుల దివ్యవాణి, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి తెనాలి రమేష్‌బాబులు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజుకు అందజేశారు. వైసీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత మూడుసెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.


వార్డు ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న నాదెండ్ల మనోహర్

ఎన్డీఏ కూటమిని గెలిపించుకుందాం

● నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 22: రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి, సంక్షేమానికి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోవాలని జనసేన పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగు జనచైతన్యయాత్రలో భాగంగా సోమవారం మనోహర్ ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని 25, 26వ వార్డులలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ వార్డులలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను విచారించారు. వార్డులో నిత్యం ఎదుర్కొంటున్న పలు సమస్యలను మనోహర్ దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరి ఆశీస్సులతో విజయం సాధించిన వెంటనే తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రజలందరి సంక్షేమాన్ని తెనాలి ప్రాంత అభివృద్ధికి మరింతగా పాటుబడతానని మనోహర్ హామీ ఇచ్చారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేయాలని, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ప్రజలకు మనోహర్ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడిపార్టీ అధికారం చేపట్టిన వెంటనే అందించనున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారికి కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత వార్డు పర్యటనకు వచ్చిన మనోహర్‌ను పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించి స్వాగతం పలకగా మహిళలు దిష్టితీసి ప్రచారాన్ని ముందుకు నడిపారు. పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

డాక్టర్ మనోహరం ఎన్నికల ప్రచారం

జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కూటమి గెలుపుతో రాష్ట్రంలో మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు పూర్తి ఉచితంగా అందించనున్నట్లు జనసేన పీఏసీ ఛైర్మన్, ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరి పెమ్మసాని రాజ్యలక్ష్మి, ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి మనోహరం సోమవారం మండలంలోని కొలకలూరులో పర్యటించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీమేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఉమ్మడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు వీరమహిళలు, తెలుగుమహిళలు, ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో మరో రెండు నామినేషన్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22: తెనాలి అసెంబ్లీ నియోజకవర్గానికి మరో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ బాషీద్ నామినేషన్ పత్రాలు అందించారు. ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా అమానుల్లాఖాన్ నామినేషన్ పత్రాలు అందించారు. దీంతో తెనాలి అసెంబ్లీకి నామినేషన్ల సంఖ్య ఐదుకు చేరింది.

కొల్లిపరలో గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

కొల్లిపర, ఏప్రిల్ 22: గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరు-దావులూరు సమీపంలో రేపల్లె బ్యాంకు కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు వయస్సు సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చునని, బ్లాక్ ప్యాంట్, పాచికలర్ ఫుల్‌హ్యాండ్ షర్ట్, తెలుపు రంగు కట్‌బనియన్, నలుపురంగు బెల్ట్ ధరించబడి ఉన్నాయని, కుడి చేతికి దారంతో పేనిన ఆరెంజ్ కలర్ మణికట్టు బ్యాండేడ్, ఎరుపురంగు కాశీదారం, తెల్లటి ముత్యపు ఉంగరం, సాయిబాబా రూపుకలిగిన ఉంగరం ఉన్నాయన్నారు. మృతదేహానికి సంబంధించిన సమాచారం తెలిస్తే కొల్లిపర పోలీసుస్టేషన్‌లోగాని, ఎస్‌ఐ రవీంద్రరెడ్డి 9440900863, రూరల్ సీఐ రమేష్ 9440796219లకు తెలియజేయాలన్నారు.


బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న కాంతారావు, సుబ్రహ్మణ్యం, కుమార్ తదితరులు

ఏలూరి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రారంభం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22: పట్టణంలోని దేవీచౌక్‌లో ఏలూరి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శాఖను సోమవారం కాకతీయ సొసైటీ ఛైర్మన్ డీఎల్ కాంతారావు ప్రారంభించారు. సహకార రంగంలో ఉన్న సొసైటీలు, బ్యాంకులను ఖాతాదారులు ఎంతగానో ఆదరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చేందుకు సరళతరమైన విధానాలను అవలంభిస్తూ సొసైటీలు ముందుకు వెళుతున్నాయన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ను కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, లాకర్స్ రూమ్‌ను నటరాజ్ జ్యూయలర్స్ ఎండీ కొత్తమాసు కుమార్ ప్రారంభించారు. డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఛైర్మన్ గురవయ్య, మేనేజర్ రవిమోహన్, శేషకుమార్ పాల్గొన్నారు.

పెమ్మసాని గెలుపు గుంటూరు జిల్లా అభివృద్ధికి మలుపు

● వీరవల్లి మురళి


పెమ్మసానికి మద్దతు తెలుపుతున్న వీరవల్లి మురళి, నాగభూషణం, కనగాల శ్రీనివాసరరావు తదితరులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 22: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గెలుపు గుంటూరు జిల్లా అభివృద్ధికి మలుపని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. సోమవారం గుంటూరులో ఉమ్మడి పార్టీల ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌కు మద్దతు తెలుపుతూ అంగలకుదురు గ్రామం నుంచి వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీ శ్రేణులు తరలివెళ్లి పెమ్మసానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేశారని ఆ పార్టీ సిద్ధాంతం విధ్వంసమని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపుతో చంద్రబాబు సీఎంగా రాజధాని అమరావతి నూతన ఉత్సాహంతో దినదినాభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలవనుందన్నారు. ఉమ్మడి పార్టీల అభ్యర్థి జనసేన పార్టీలో రెండో ముఖ్యనేతగా ఉన్న నాదెండ్ల మనోహర్ గెలుపుతో తెనాలి ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందనుందన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నిస్వార్థపరుడు, ప్రజాసేవకుడిగా ప్రజల్లో మన్ననలు పొందిన పెమ్మసాని చంద్రశేఖర్ వంటి ఉత్తముడు ఎంపీగా గెలిస్తే రాష్ట్రంలో గుంటూరు జిల్లా ఉద్యోగ ఉపాధి అవకాశాలతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందనుందని మురళి చెప్పారు. ప్రజలందరూ ఉమ్మడి పార్టీల అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని అభివృద్ధి, సంక్షేమ పాలనకు పట్టంగట్టాలని కోరారు. ఘట్టమనేని రామకృష్ణ, సూర్యదేవర విజయ్, ఎస్‌కె. జాఫర్, బిట్రా యుగంధర్, ముప్పవరపు సాంబశివరావు, హర్షానాయక్, శంకర్‌నాయక్, కంచర్ల నరేంద్ర, కంచర్ల మురళి, చెన్నుపాటి చిట్టి పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


పెమ్మసాని నామినేషన్‌కు పెదకాకాని నుంచి భారీగా తరలివెళ్తున్న టీడీపీ నాయకులు కార్యకర్తలు

భారీగా తరలి వెళ్లిన పెదకాకాని మండల నాయకులు

పెదకాకాని, ఏప్రిల్ 22: పొన్నూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పెదకాకాని మండలం జనసేన పార్టీ అధ్యక్షులు వీరెళ్ళ వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్‌కు భారీస్థాయిలో బయలుదేరి వెళ్లారు. పెదకాకాని మండలం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.


నుదురుబాడులో రోడ్ షోలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్ కుమార్‌లు

అభివృద్ధి కావాలంటే టీడీపీకి ఓట్లు వేయండి

● గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

ఫిరంగిపురం, ఏప్రిల్ 22: రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉండాలంటే టీడీపీకే ఓట్లు వేసి గెలిపించాలని గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వేమవరం, నుదురుపాడు, కండ్రిక గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన రోడ్డుషోలో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదు సంవత్సరాల పాలన, గత టీడీపీ పాలనను ప్రజలు పోల్చుకోవాలని కోరారు. నుదురుపాడు గ్రామం వైసీపీకి పట్టు ఉన్న గ్రామం. ఐతే ఇటీవల టీడీపీ ద్వారాన్ని వైసీపీ వారు పడగొట్టారని తెలిసిందని, టీడీపీ కార్యకర్తల కోసం తాను ఎంత నష్టపోయినా అండగా ఉంటానని, దౌర్జన్యకరమైన పనులు చేస్తే సహించేది లేదన్నారు. ధర్మం వైపు, న్యాయం వైపు ఉండాలని కోరారు. గ్రహాలు తిరుగుతుంటాయని, ఓడిన పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుం దన్నారు. గల్లీగల్లీలో పార్టీలకు అతీతంగా సిమెంట్ రోడ్లు తెలుగుదేశం హయాంలోనే వేశారన్నారు. వైసీపీకి అసలు ఓట్లు ఎందుకు వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాజధాని లేకున్నా పర్వాలేదా?, పోలవరం కట్టకున్నా ఓకేనా?, మీ ఆస్తులు రిజిస్టర్ కార్యాలయంలో మీ పేరుపై లేకున్నా పర్వా లేదా?, మీ పిల్లలకు ఉద్యోగం లేకున్నా ఏం బాధ లేదా?, పరిశ్రమలు లేకుండా చేసినా మీకు సమ్మతమేనా?, మీ పిల్లలు గంజాయికి బానిలైనా ఓకేనా?, ఆయన ప్రశ్నించారు.


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మాంటిస్సోరీ ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే

పది ఫలితాల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22: పదో తరగతి ఫలితాల్లో బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో పి.నవ్య 584మార్కులు సాధించి ప్రతిభచూపింది. సమైఖ్య, ప్రీతి 568 మార్కులు సాధించారని, 13 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు పొందిన వారిలో ఉన్నారని ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలు, పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రతిభ చూపారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ 582 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా, పెదరావూరు హైస్కూల్ విద్యార్థిని రాచకొండ తన్మయ 578 మార్కులతో ద్వితీయ స్థానం, నందివెలుగు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని టి.తన్విత 577 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తీర్ణతలో జడ్పీహెచ్‌ఎస్ నందివెలుగు 87.1శాతం, అంగలకుదురు హైస్కూల్ 84.9శాతం, కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాల 84.8శాతం, ఖాజీపేట హైస్కూల్ 82.5శాతం, చెంచుపేట హైస్కూల్ 71.6శాతం, ఐతానగర్ హైస్కూల్ 70.4శాతం, కొత్తపేట బాలుర హైస్కూల్ 70.3శాతం, గంగానమ్మపేట హైస్కూల్ 70.2 శా తం, సంగంజాగర్లమూడి హైస్కూల్‌లో 67.2శాతం, బుర్రిపాలెం హై స్కూల్ 65.6శాతం, పెదరావూరు హైస్కూల్ 61.2శాతం, కఠెవరం హై స్కూల్ 57.8శాతం, మారీసుపేట హైస్కూల్ 54.9శాతం, కొలకలూరు హైస్కూల్ 52.8శాతం మార్కులు సాధించారని ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, ఏప్రిల్ 22: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 95శాతం ఉత్తీర్ణత అయినట్లు ఎంఈవో సాల్మన్‌రాజ్ తెలిపారు. సోమవారం స్థానిక విద్యాభవనంలో జరిగిన సమావేశంలో అయిన మాట్లాడుతూ 382మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 363మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు. మండల పరిధిలోని అత్తోట హైస్కూల్‌కు చెందిన యర్రు లక్ష్మీపూజిత 576, మున్నంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన కె.వివేక్ 575మార్కులు, ఎన్.శ్రీచైతన్య 573మార్కులు సాధించారు.

పెదరావూరు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 22: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నట్లు త్రీటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు చెప్పారు. మండల పరిధిలోని పెదరావూరు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద కోఆపరేటివ్ అసిస్టెంటు రిజిస్ట్రార్ ఎ.రాధాదేవి, త్రీటౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వరావు సిబ్బందితో వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధలను పాటించాలని, వాటిని అతిక్రమించి వాహనాలలో నగదు, మద్యం తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ టీమ్, త్రీటౌన్ పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిపై పోలీసుల దాడి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 22: పట్టణంలో త్రీటౌన్ పరిధిలో ఎన్నికల నేపథ్యంలో లాడ్జీలపై పోలీసులు దాడులను నిర్వహించారు. త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు కథనం మేరకు సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ఒక లాడ్జిలో తనిఖీలను నిర్వహిస్తుండగా లాడ్జి నిబంధనలకు విరుద్ధంగా వ్యభిచారం నిర్వహిస్తున్న లాడ్జి యజమాని శ్రీనివాసును, విటులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రకాశరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఆత్మీయ సమావేశం

తెనాలి క్రైం, ఏప్రియల్ 22: బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. కొద్ది రోజుల క్రితం 11వ అదనపు జిల్లా న్యాయాధికారిగా డి.శ్రీనివాస్‌ను బార్ అసోసియేషన్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. న్యాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి బార్ అసోసియేషన్ కృషి చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రభాకర్ మాట్లాడుతూ తెనాలి బార్ అసోసియేషన్‌కి తనదైన ప్రత్యేక గుర్తింపు, చరిత్ర ఉంది. ఈ బార్ అసోసియేషన్ గౌరవాన్ని మరింత ఇనుమడింపచేయడానికి నూతన కమిటీ మరింతగా కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.ప్రభాకర్, అన్నం పిన్నారావు, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, తదితర కమిటీ సభ్యులకి న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్

సమన్వయంతో ముందుకు సాగుదాం

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22: రానున్న రోజుల్లో కలిసి మెలసి ముందుకు సాగుదామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, రావి వెంకటరమణలు పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించి ఇద్దరికి చెందిన నాయకులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రావి వెంకటరమణకు, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందన్నారు. రానున్న ఎన్నికలో కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని కోరారు.

అనంతరం రావి వెంకటరమణ మాట్లాడుతూ 15ఏళ్లుగా తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు కూడా తనతోపాటు టీడీపీలోకి రావటం హర్షణీయం అన్నారు. టీడీపీలో తగిన గుర్తింపు వచ్చేలా కృషిచేస్తానని హామీఇచ్చారు. ఐదేళ్లలో రాష్ట్రంలో రాక్షస పాలనతో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. అరాచక, విధ్వంస పాలనకు వ్యతిరేకంగా అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ వైపు అడుగు వేసిన్నట్లు చెప్పారు. తమవంతు సహాయ సహకారాలను అందించాలని రావి వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, రావి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ధూళిపాళ్ల నామినేషన్

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 22: పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఈ నెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టీడీపీ కార్యాలయ ప్రతినిధులు సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని చింతలపూడి నరేంద్రకుమార్ స్వగృహం నుంచి ర్యాలీ బయలుదేరనున్నట్లు చెప్పారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

తక్కెళ్ళపాడు రోడ్డు వద్ద 511 చీరల స్వాధీనం

పెదకాకాని, ఏప్రిల్ 22: పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు రోడ్డు వద్ద 511 చీరలను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. గుంటూరు నుంచి ఆటోలో తెనాలి వైపు వెళ్తుండగా తక్కెళ్ళపాడు అడ్డరోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు నుంచి తెనాలి వైపు వెళ్తున్న ఆటోని అదుపులో తీసుకొని విచారించగా ఎన్నికల కోసం చీరలు పంచేందుకు తరలిస్తున్నట్లు తెలిసింది. వీటి విలువ రూ.4.10 లక్షలు ఉంటుందని పోలీసులు భావించారు.

పొన్నూరు అసెంబ్లీకి 3 నామినేషన్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22: పొన్నూరు శాసనసభ ఎన్నికల కోసం సోమవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి ఏ లక్ష్మీకుమారి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో సోమవారం వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ నామినేషన్‌ను దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జక్క రవీంద్రనాద్, జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి వరికుంట రోశయ్య నామినేషన్‌ను దాఖలు చేశారు.